

● రాయితీ రుణాలను అటకెక్కించిన గత ప్రభుత్వం
● కూటమి పాలనలో జిల్లాల వారీగా నిధులు కేటాయింపు
● లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు



రుణాల విషయంలో బీసీ సంఘాల నాయకులకు కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సదస్సు (ఫైల్)

బీసీ కార్పొరేషన్‌కు... రుణ కళ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వెనకబడిన వర్గాల సాధికారత కోసం ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్‌ను కేవలం అలంకారప్రాయంగా మార్చి ఐదేళ్ల పాటు రాయితీ రుణాలు అనే మాటే లేకుండా గత ప్రభుత్వం పాలన సాగించింది. రాయితీ రుణాలు అందక ఆయా కులవృత్తుల వారితో పాటు నిరుద్యోగులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ ఐదేళ్ల వ్యవధిలో దాదాపు లక్ష మంది బీసీలు ఈ రాయితీ ఫలాలకు దూరంగా ఉండిపోయారు. కూటమి ప్రభుత్వం బీసీల ఆర్థిక సాధికారతను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని కార్పొరేషన్‌కు జవసత్వాలు కల్పించడంతో పాటు రాయితీకి సంబంధించి లబ్ధిదారుల సంఖ్యతో పాటు నిధుల మంజూరుపై కూడా స్పష్టత ఇవ్వడంతో ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాల్లో బీసీ సంఘాలతో సమావేశాలు కూడా పెట్టిన అధికారులు లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జరపడానికి కసరత్తు చేస్తున్నారు

2014-19 మధ్య పెద్ద సంఖ్యలో లబ్ధి...

2014–19 మధ్య టీడీపీ పాలనలో వెనకబడిన వర్గాలకు వివిధ పథకాల ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరింది. వాటిలో (మిగతా 8వ పేజీలో..)

కార్పొరేషన్ క్రియాశీలకంగా...

ఈ మొత్తం రుణాల ప్రక్రియలో బీసీ వెల్ఫేర్ విభాగంతో పాటు కార్పొరేషన్‌కూడా పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కానున్నాయి. ఏకపక్ష నిర్ణయాలు కాకుండా తొలి దశ కింద బీసీ కార్పొరేషన్ అధికారులు ఆయా బీసీ కుల సంఘాల ప్రతినిధులతో సమావేశమై రుణాల మంజూరులో తగిన సూచనలు, సలహాలు కోరుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో కూడా ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రక్రియ జరగాలనే ఆదేశాలు ఇప్పటికే సంబంధిత అధికారులకు అందాయి.

● మున్సిపాలిటీల్లో పేరుకుపోతోన్న పన్నులు
● మొండిబాకీల్లో ప్రభుత్వ కార్యాలయాల వాటానే అధికం
● నోటీసులు జారీ చేస్తున్నా పట్టించుకోని శాఖాధికారులు
● మార్చికి వసూలు చేయాలని ఆదేశాలు.. లక్ష్యం నెరవేరేనా?

బకాయిల భారం



ఆంధ్రజ్యోతి ఫోకస్

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

సామాన్యుడు పన్ను చెల్లించకపోతే మున్సిపల్ అధికారులు నానాయాగీ చేస్తారు. నగదు సర్దుబాటు కాక ఆలస్యంగా చెల్లిస్తే జరిమానాలు వేస్తారు. అలాంటిది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, వారి ఆస్తులకు సంబంధించిన పన్నులు రూ.లక్షలో పేరుకుపోతున్నా పట్టడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల పరిధిలో పదుల సంఖ్యలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా శాఖలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి. అయితే కొన్ని శాఖల నుంచి రెండు దశాబ్దాలుగా పన్ను బకాయిలు పేరుకుపోయాయి. అసలు తాము మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాము.. మున్సిపాలిటీ నుంచి సౌకర్యాలు పొందుతున్నాము.. అందుకు పన్నులు చెల్లించాలి.. అన్న విషయమే ఆయా శాఖలు మరిచాయి. ఈ కారణంగా ఆయా శాఖల కార్యాలయాలకు సంబంధించి రూ.లక్షల్లో పన్ను బకాయిలు పేరుకుపోయాయి. మార్చి కల్లా బకాయిలు వసూలు చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. అయితే బకాయిలు చెల్లించాలన్న స్పృహ ఆయా శాఖల అధికారుల్లో లేదు. వసూలు చేయాలన్న ఆలోచన మున్సిపల్ అధికారుల్లో కానరావడంలేదు. పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నులు పేరుకుపోతున్నా వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదని, అందువల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ.కోట్లకు చేరాయని తెలుస్తోంది. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. కమిషనర్లు ఆయా శాఖల అధికారులకు పన్ను బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు నోటీసులు జారీ చేస్తున్నా.. వారు పట్టించుకోవడంలేదు. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నా చెల్లింపులపై ఆయా శాఖల అధికారులు ఆలోచన చేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను కొన్నేళ్లుగా కొండలా పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి రైల్వే, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ తదితర శాఖల పన్నులు పెద్దఎత్తున పేరుకుపోయి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఏపీ సీపీడీసీఎల్, పోలీస్, జ్యూడిషియల్, రెవెన్యూ పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, విద్యాశాఖలకు సంబంధించి పన్నులు వసూలు కావాల్సి ఉంది.







రూపాయి కూడా చెల్లించని ప్రభుత్వం

చీరాల: మున్సిపాల్టీకి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. బుధవారం నాటికి ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.2,77,38,369 చెల్లించాలి. వీటిలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అత్యధికంగా రూ.78,95,432 పేరుకుపోయి ఉంది. రూ.57,41,208 పోలీస్‌స్టేషన్లు, క్వార్టర్లకు సంబంధించి బకాయి ఉండగా ఆదాయం పుష్కలంగా ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రూ.1,56,294, సబ్ ట్రెజరీ కార్యాలయం రూ.1,21,522, డ్రైనేజీ కార్యాలయం, క్వార్టర్లు రూ.34,48,186, ఇరిగేషన్ కార్యాలయం నుంచి రూ.5,93,452 బకాయిలు పేరుకుపోయాయి. పట్టణ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు రూపాయి కూడా పన్నులు చెల్లించకపోవడంతో బకాయిల్లో పెద్దమొత్తంలో వీటివే ఉన్నాయి. ఇక సాధారణ అసెస్‌మెంట్లు 23,286 ఉండగా వాటి డిమాండ్ రూ.12,48,92,187 కాగా ఇప్పటి వరకు రూ.6,41,35,112 వసూలు చేశారు. రూ.6,07,57,074 వసూలు కావాల్సి ఉంది. కొన్ని మొండి బకాయిలు వసూలు కాకపోవడానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పలువురు కౌన్సిలర్లే కారణమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఎన్ఎస్పీ కార్యాలయ బకాయి రూ.13 లక్షలు

అద్దంకి: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో 17 ప్రభుత్వ భవనాలకు సంబంధించి సుమారు రూ.71 లక్షల బకాయిలున్నాయి. వీటిలో ప్రధానంగా ఎన్ఎస్పీ కార్యాలయం నుంచి రూ.13.63 లక్షలు, ఎంపీడీవో కార్యాలయం నుంచి రూ.12.13 లక్షలు, బీసీ బాలికల వసతిగృహం నుంచి రూ.9.54 లక్షలు, పోలీస్ స్టేషన్ నుంచి రూ.7.32 లక్షలు, స్త్రీ శక్తి భవన్ నుంచి రూ.5.90 లక్షలు, డీఈ ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి రూ.4.75 లక్షలు, తహసీల్దార్ కార్యాలయం నుంచి రూ.5.16 లక్షలు, ఇరిగేషన్ కార్యాలయం నుంచి రూ.4.98 లక్షలు, వ్యవసాయ కార్యాలయం నుంచి రూ.3.08 లక్షలు, బకా శాఖ కార్యాలయం నుంచి రూ.1.32 లక్షలు బకాయిలున్నాయి.

పోలీసుల బకాయే అత్యధికం

బాపట్ల: బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. రాష్ట్రప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.2 కోట్లు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.13 లక్షలకు పైగా పన్ను బకాయిలున్నాయి. పోలీసు భవనాలకు సంబంధించి అత్యధికంగా రూ.53,62,201 బకాయిలున్నాయి. అటవీశాఖ రూ.64,986, పీడబ్ల్యూడీ రూ.11,03,941, గురుకుల పాఠశాల రూ.47,34,931, ఆర్అండ్‌బీ రూ.17,14,397, మత్స్యశాఖ రూ.11,36,803, మండలపరిషత్ 9,56,045, తాలూకా కార్యాలయం రూ.14,64,139, విద్యాశాఖ రూ.9,44,627, ఎస్సీ కార్పొరేషన్ రూ.24,89,011, ఆర్అండ్‌బీ అతిథిగృహం రూ.17,28,914, పంచాయతీరాజ్ కార్యాలయాలు రూ.18,18,502, మార్కెట్‌కమిటీ కార్యాలయాల నుంచి రూ.1,86,988 బకాయిలున్నాయి.

43 కార్యాలయాలు.. రూ.1.45 కోట్లు

పొన్నూరు: పొన్నూరులో 43 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా రూ.1,45,61,975 పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం రూ.21,52,868, ఫిషరీష్ కార్యాలయం రూ.21,46,140, పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయం రూ.16,33,162, ట్రాన్స్‌కో రూ.13,04,645 బకాయిలు ఉన్నాయి. నీటి పారుదలశాఖ, పోలీస్‌స్టేషన్లు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పోలీస్ క్వార్టర్ల పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పన్ను బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు తెలిపారు.



బకాయిలు రూ.77.80 కోట్లు

గుంటూరు: గుంటూరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు 984 ఉండగా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో 705 కార్యాలయాలు ఉండగా రూ.35.46 లక్ష బకాయి ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 279 కార్యాలయాలు ఉండగా బకాయి రూ.77.45 కోట్లు ఉంది. ఆయా కార్యాలయాలకి సంబంధించిన బకాయి రూ.77.80 కోట్ల ఉన్నట్లు నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. రూ.కోట్లలో బకాయిలు పెండింగ్‌లో ఉన్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ఇప్పటికే నోటీసులు పంపించామని తెలిపారు.



రెండు దశాబ్దాలుగా చెల్లింపులు లేవు

చిలకలూరిపేట: చిలకలూరిపేట మునిసిపాలిటీకి ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ.1.88 కోట్ల వరకు ఉన్నాయి. జిల్లా పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆస్తులకు సంబంధించి రెండు దశాబ్దాలుగా, పోలీస్ శాఖ నుంచి దశాబ్ద కాలంగా పన్నుల చెల్లింపులు లేవు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పదేళ్లుగా పన్ను చెల్లించలేదు. ఎస్సీ కార్పొరే షన్ దుకాణాలకు సంబంధించి 2005 నుంచి, పంచాయతీరాజ్ దుకాణా లు 2009 నుంచి పన్ను బకాయిలు ఉన్నాయి. తహసీల్దారు కార్యాలయం రూ.27.48 లక్షలు, ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలకు సంబంధించి రూ.29.27 లక్షలు, పంచాయతీరాజ్ దుకాణాల నుంచి రూ.15.29 లక్షలు, శారదా జిల్లా పరిషత్ హైస్కూల్ రూ.12.47 లక్షలు, జడ్పీ బంగళా రూ.6.5 లక్షలు, హైస్కూల్ రూ.21.79 లక్షలు, ఎస్సీ బాలుర హాస్టల్ రూ. 5.92 లక్షలు, అర్బన్ పోలీస్‌స్టేషన్ నుంచి రూ.7.15 లక్షలు వసూలు కావాల్సి ఉంది.



మిర్చియార్డు ప్రక్షాళన?

● గాడిన పెట్టేందుకు రంగంలోకి ప్రభుత్వం
● నేడు మంత్రి అచ్చెన్నాయుడి అధ్యక్షతన కీలక సమావేశం
● హాజరు కానున్న మార్కెటింగ్ ఉన్నతాధికారులు, మిర్చియార్డు అధికారులు

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. అదే సమయంలో అక్రమాలు, అవినీతికూపంలో కూరుకుపోయింది. గత వైసీపీ హయాం లో నాటి ప్రభుత్వ పెద్దలు మిర్చియార్డును భ్రష్టుపట్టించారు. పాలకవర్గం అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేసింది. విచ్చలవిడిగా జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యా పారాలను అమలు చేయించారు. మరోవైపు కమీషన్ ఏజంట్, వేమెన్ లైసెన్సుల రెన్యువల్స్, పేరు మార్పులతో రూ.కోట్లు దోచేశారు. ఈ పరిస్థితుల్లో మిర్చియార్డు ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇక్కడి పరిస్థితు లను చక్కదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రూ.వందల కోట్ల అవినీతి జరి గిందని విజిలెన్స్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన దృష్ట్యా యార్డుని గాడిన పెట్టేందుకు తానే రంగంలోకి దిగాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు నిర్ణయించారు. గురువారం చుట్టుగుంట సెంటర్‌కు సమీపంలోని మార్కెటింగ్ కమిషనరేట్‌కు రావాల్సిందిగా మిర్చియార్డు అధికారులను ఆదేశించారు. ఈ సమావే శానికి మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి బుడితి రాజశేఖర్, డైరెక్టర్ విజయసునీత, జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు కూడా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో ఏ అంశాలపై చర్చించి ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తారోనన్న ఉత్కంఠ మార్కెటింగ్ వర్గాల్లో నెలకొన్నది. మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విజిలెన్స్ డీజీకి చేసిన ఫిర్యాదు ఆధారంగా నిర్వహించిన విచారణలో రూ.346కోట్ల అవినీతి జరిగినట్లు ఆ శాఖ తేల్చింది. దీనిపై మంత్రి నిర్వహించే సమావేశంలో చర్చించి చర్యలకు ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మిర్చి అమ్మి పెట్టేది.. కొనుగోలు చేసేదీ వారే

మిర్చియార్డులో కొంతమంది వ్యాపారులకు బహుళ లైసెన్సులు ఉన్నాయి. కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు కలిగిన కుటుంబాలు దాదాపుగా 50కి పైగానే ఉన్నట్లు సమాచారం. అయితే ఒకే పేరుతో ఇవి లేకపోవడంతో వాటికి చట్టబద్ధత సమకూరింది. దీంతో రైతు మిర్చియార్డుకు తీసుకొచ్చిన సరుకుకు సరైన ధర లభించే పరిస్థితి లేకుండా పోయింది. ఇందుకు కారణం ధర ఆఫర్ చేసే ఎక్స్‌పోర్టర్, అమ్మే కమీషన్ వ్యాపారి రక్తసంబంధీకులు అవుతుండటమే. ఇక కొంతమంది వ్యాపారులకు కోల్డ్‌స్టోరేజ్‌లు ఉండటంతో వాటిని నింపుకోవడానికి మార్కెట్‌లో ధర పెరగకుండా చూస్తారు. దాంతో రైతు చేసేది లేక కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసుకునేందుకు మొగ్గు చూపుతాడు. ఈ విధంగా అన్ని వైపుల నుంచి యార్డులో రైతును పిండుకుంటున్నారు. వేలానికి నిర్వచనం పోటీ. అయితే మిర్చియార్డులో ఇందుకు విరుద్ధమైన అర్థం ఉన్నది. వేలం అంటే రైతు ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా వ్యాపారులే నిర్ణయిస్తారు. ఇందుకు అనుకూలమైన పరిస్థితులను వ్యాపారులే సమకూర్చుకున్నారు. బడా వరలు ఎంత ధరని నిర్ణయిస్తే దానినే ఇతర వ్యాపారులు కూడా అనుసరిస్తూ ఉంటారు. ఇలా యార్డులో రైతు తెచ్చిన మిర్చిని అమ్మి పెట్టేది ఒకరే, కొనుగోలు చేసేది ఒకరే కావడంతో పోటీ లేకుండా పోతున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ విధానాన్ని తీసుకొచ్చినా బిడ్డింగ్‌లోనూ పోటీ కనిపించదు. ఒక ఎగుమతి వ్యాపారే బిడ్డింగ్‌లో పాల్గొంటారు. దాంతో అతడే సక్సెసర్ అవుతారు. ఒకవేళ రెండు బిడ్‌లు దాఖలైనా ఆ రెండు కూడా ఆ ఎక్స్‌పోర్టర్‌కు చెందినవే అవుతున్నాయి.

గుట్కా వ్యాపారికి అందలం

గత ప్రభుత్వంలో ఓ గుట్కా వ్యాపారిని వైసీపీ పెద్దలు తీసుకొచ్చి మిర్చియార్డు పీఠంపై కూర్చోబెట్టారు. అనతికాలంలోనే కోకొల్లలుగా అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు పోగేసుకొన్నాడు. చంద్రగిరి ఏసురత్నం ఛైర్మన్‌గా వ్యవహరించిన సమయంలో రెన్యువల్‌కు రావాల్సిన లైసెన్సులను కొందరు కోర్టులో వేసి స్టే తెచ్చుకుని రాకుండా చేశారు. ఆయన రాజీనామా తర్వాత లైసెన్సుల వ్యవహారాన్ని వైసీపీ నేతలు తెరపైకి తెచ్చారు. అధికారులను ఏమార్చి ఒకేసారి ఏకంగా 270కి పైగా లైసెన్సుల రెన్యువల్ చేసేశారు. ఇందులో కనీసం రూ.5 కోట్లు పైగానే చేతులు మారాయన్న విషయం బహిరంగ రహస్యమే.





గ్రామోత్సవంలో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కనుల పండువగా కల్లిపాడు

● ముగిసిన వీరారాధన ఉత్సవాలు
● పోతురాజుగుట్ట వద్ద తంగెడ మండలపై ఒరిగిన కొణతములు

8



వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం

వెంకన్న ఆలయానికి మహర్దశ

● పూర్వపు ప్లాన్ ప్రకారమే పనులు
● పనులకు అడ్డుగా 'సుజల' ప్రధాన వాటర్ ప్లాంట్
● వేరేచోటుకు త్వరగా మార్చాలంటున్న టీటీడీ అధికారులు

గుంటూరు, పల్నాడులో స్వల్పంగా భూ ప్రకంపనలు

● ప్రజల్లో భయాందోళన

సీసీఐకి వణుకు!

● సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసిన మాజీ మేనేజర్

6

కుమార్తెల దాడిలో తండ్రి మృతి

● మద్యం తాగి వచ్చి తల్లిని పట్టించుకోవడం లేదని..
● యడ్లపాడు మండలం బోయపాలెంలో ఘటన

● 7న ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక సమావేశాలు
● తల్లిదండ్రులు, గురువులు ఒకే వేదికపైకి..
● పాఠశాల, విద్యార్థి ప్రగతిపై ప్రత్యేకచర్చ
● పాఠశాలల అభివృద్ధిపై దిశానిర్దేశం
● ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి..
● బాపట్ల జిల్లాలో పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు

అమ్మానాన్నలకు ఆహ్వానం

గుంటూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సర్కారు పాఠశాలల్లో ఉపాధ్యాయుల్ని, తల్లిదండ్రుల్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే మహత్తర కార్యక్రమానికి సర్వం సిద్ధం అయింది. సీఎం చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లాలో జరిగే వేడుకల్లో పాల్గొని సమావేశాలను లాంచనంగా ప్రారంభించనున్నారు. ఇక గ్రామస్థాయి నుంచి అన్ని పాఠశాలల్లో 7వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని ఒకే వేదికపైకి చేర్చి విద్యాపరమైన అంశాలు చర్చించి ప్రభుత్వ పాఠశాలల్ని మరింత బలోపేతం చేసే మహత్తర కార్యక్రమానికి విద్యాశాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పాఠశాల స్థాయిలో విద్యార్థినీ విద్యార్థుల ప్రగతి నివేదికలు, వైద్య నివేదికలు సిద్ధం చేశారు. కార్యక్రమ నిర్వహణ కోసం విద్యాశాఖ విద్యార్థుల సంఖ్యను అధారంగా నిధులు మంజూరు చేసింది.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, యూపీ, మండల పరిషత్ పాఠశాలలు దాదాపు 3,872 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు 6.97 లక్షల మంది విద్యార్థిని విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈనేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరు సమావేశాల్లో పాల్గొనేలా ఇప్పటికే ప్రత్యేక ఆహ్వానాలు పాఠశాల స్థాయి నుంచి హెచ్ఎంలు పంపారు.

పాఠశాల సమగ్ర అభివృద్ధికి దిశానిర్దేశం

ప్రభుత్వ పాఠశాలల సమగ్రాభివృద్ధికి ఈ సమావేశాలు దిశానిర్దేశం చేయనున్నాయి. ఏటా పాఠశాల స్థాయిలో జరిగే తల్లిదండ్రుల సమావేశాలకు భిన్నంగా ఈ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు (మిగతా 6వ పేజీలో..)



సమన్వయం, సహకారంతోనే ఉత్తమ ఫలితాలు

● జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్

గుంటూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమన్వయం, సహకారం తోనే ఉత్తమ ఫలితాలు సాధించటం సాధ్యం అవుతుందని గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి బీఎస్ సాయి కుమార్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, బాపట్ల జిల్లాలోని వివిధ శాఖల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల నినాదాలు దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల భాగస్వామ్యంతో అభివృద్ధి చెందిన గ్రామాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.మోహన్ రావు, ప్రిన్సిపాల్ వెంకట్రావు, పద్మజ, కె.నాగేశ్వరరావు తదితరులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు 6న కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సులకు ఈ నెల 6న మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ లాం ఫామ్‌లోని కృష్ణ ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఎన్ఆర్ఐ కోటా బీఎస్సీ కమ్యూనిటీ సైన్సు, బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ కౌన్సెలింగ్ అదే రోజు జరుగుతుందన్నారు.

ఆరోపణలపై విచారణకు వీసీ ఆదేశం

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తనపై వచ్చిన నిరాధార ఆరోపణలపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావును కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తూ తన పరువుతోపాటు యూనివర్సిటీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఒక పరిశోధకురాలు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. తాను కారుతో గుద్ది ఆమెను ప్రమాదానికి గురి చేసినట్లు ఆరోపించిందని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జరిగిన సంఘటనపై శాఖాపరమైన విచారణకు యూనివర్సిటీ యాజమాన్యం ఆదేశించింది. ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ముందుగా యూనివర్సిటీ లోని సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

ఉప్పలపాడు చెరువులో గుర్తుతెలియని మృతదేహం

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఉప్పలపాడు చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభించినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుని వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుంది. ఒంటిపైన నల్లగళ్ల లుంగి, శనగపిండి రంగు కలర్ ఫుల్‌హ్యాండ్ చొక్కా ధరించి ఉన్నాడు. నాలుగు రోజుల క్రితం చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 41.85 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 4,549 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయి.

సీసీఐకి వణుకు!

● సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హైకోర్టులో పిటిషన్
● దాఖలు చేసిన మాజీ మేనేజర్
● స్టాడింగ్, క్వాలిటీ కటింగ్ వ్యవహారం వెలుగులోకి
● అదనపు దూది.. అడ్డదారి అమ్మకాలపై ఆందోళన
● మల్లగుల్లాలు పడుతున్న అధికారులు, బయ్యర్లు



సీసీఐ కేంద్రాల్లోని పత్తి బేళ్లు

గుంటూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గుంటూరులో సీసీఐలో పనిచేసిన మాజీ మేనేజర్ ఈ పిటీషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని మార్కెటింగ్ శాఖను హైకోర్టు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మాజీ మేనేజర్ మొదట వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి పిటీషన్ అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ కొద్ది రోజుల క్రితం గుంటూరులోని పత్తి కొనుగోలు కేంద్రాలను రహస్యంగా తనిఖీ చేశారు. మేనేజర్‌గా పనిచేసిన వ్యక్తి ఇటువంటి డిమాండ్‌ను తీసుకురావడం అందరి లోనూ ఆసక్తి కలిగించింది. ఈ పిటీషన్‌తో బయ్యర్లు ఆందోళన చెందుతున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో లక్ష ఇరవై వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అందులో కటింగ్ పేరుతో అవకతవకలు జరిగినట్లు తెలిసింది.

క్వింటాల్‌కు రెండు కిలోలు..

సాధారణంగా సీసీఐకి రైతులు తీసుకువచ్చే పత్తి మొత్తానికి నగదు చెల్లించాలి. కానీ చాలా చోట్ల బయ్యర్లు స్టాడింగ్ కటింగ్, క్వాలిటీ కటింగ్ పేరుతో క్వింటాల్‌కు రెండు కిలోలకు తగ్గకుండా పత్తికి కోత విధించారు. కొన్నిచోట్ల తేమ పేరు చెప్పి అదనంగా కూడా కోతలు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విధానంలో సేకరించిన పత్తిని కొనుగోలు చేసిన పత్తితో కలిపి జిన్నింగ్ వేస్తారు. కొనుగోలు చేసిన క్వింటాళ్ల ఆధారంగా, కటింగ్ చేసిన మొత్తాన్ని లెక్కించి అదనంగా వచ్చిన దూది బేళ్లను (ఒక బేలు సుమారు 165 కిలోలు) ప్రైవేటుగా విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇది ప్రతి ఏటా జరిగే ప్రక్రియ అనే చెబుతున్నారు. అయితే ఈ ఏడాది ఈ వ్యవహారం సీజన్ మధ్యలోనే వెలుగులోకి వచ్చింది.

ఆ లెక్కే వేరు..

ఒక క్వింటాల్ పత్తిలో 63 శాతం విత్తనాలు, 32 శాతం దూది, 2 నుంచి 5 శాతం ప్రొడక్షన్ లాస్ కింద లెక్కిస్తారు. అక్టోబరు తర్వాత వచ్చే పత్తిలో ఔట్ రన్ (దూది శాతం) పెరుగుతుంది. ఉదాహరణకు 500 క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ వేస్తే 100 బేళ్ల దూది, సుమారు ఆరు లారీల విత్తనాలు వస్తాయి. అదే లెక్కన బయ్యర్లు రైతుల వద్ద కటింగ్ చేసిన పత్తికి కూడా దూది, విత్తనాలు పక్కకు తీస్తారు. అత్యంత విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం 10 బేళ్ల దూది వస్తే ఒక బేలు అనధికారికంగా బయ్యర్ ఖాతాలో జమ అవుతుందని సమాచారం. ఈ లెక్కన జిల్లాలో గతేడాది 1.30 లక్షల పత్తి బేళ్లు సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన పత్తి నుంచి తీశారు. దానికి తగినట్లుగానే అదనపు బేళ్లు బయటకు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పత్తి క్యాండీ (రెండు దూది బేళ్లు ఒక క్యాండీ) విలువ రూ. 50 వేలు పలుకుతుంది. ఈ ఏడాది అదనపు పత్తి బేళ్లను చాలామంది బయ్యర్లు ప్రైవేటుగా అప్పుడే అమ్మేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు బయ్యర్లు మిల్లుల యజమానులకే వాటిని విక్రయించినట్లు సమాచారం. వచ్చిన దాంట్లో అందరికీ పంపకాలు చేస్తున్నట్లు ఒక బయ్యర్ చేసిన వ్యాఖ్యలు రికార్డు అయ్యాయి. ప్రస్తుత పిటీషన్‌తో మొత్తం విషయంపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సీసీఐ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నిబంధన ఉందని అధికారులు చెబుతున్నారు. మాజీ మేనేజర్‌తో మాట్లాడి పిటీషన్ విత్‌డ్రా చేయించేందుకు పలువురు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

సమస్యలు పరిష్కరించి అండగా నిలుస్తాం

● 49వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్ భరోసా



దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో వచ్చే సమస్యలు పరిష్కరించి బాధితులకు అండగా నిలుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఉండవల్లిలోని నివాసంలో 49వ రోజు ప్రజాదర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంత్రిని కలిసి తాము ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలను విన్నవించారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన మంత్రి పలు సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని చెప్పారు.

విడదల రజని అండతో అక్రమంగా సస్పెండ్ చేశారు

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో 19 ఏళ్లగా అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఐటీ మేనేజర్, ఈఈ, ఎంఐసీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈవో, అటెండర్ల సర్వీసును గుర్తించి కాంట్రాక్ట్ బేసిక్ విధానంలోకి మార్చాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం అందేలా చూడాలని విన్నవించారు. వైసీపీ పాలనలో అప్పటి మంత్రి రజని అండతో నాడు-నేడు పనుల్లో అవినీతికి బాధ్యుడిని చేసి అక్రమంగా సస్పెండ్ చేశారని, తన సస్పెన్షన్ కాలాన్ని క్రమబద్ధీకరించాలని పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన స్కూల్ అసిస్టెంట్ వి.వీరయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. నాడు-నేడు పనుల్లో అవినీతికి పాల్పడిన చిలకలూరిపేట జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె. రత్నజ్యోతిని కాపాడేందుకు అప్పటి పల్నాడు డీఈవో కాగిత శామ్యూల్, నర్సరావుపేట ఎంఈవో ఎస్.నాగేశ్వరరావును విడదల రజని ప్రభావితం చేసి తనను బలిపశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయిన వారికి త్వరితగతిన నష్టపరిహారం అందించేలా చర్యలను తీసుకోవాలని ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం ఏజెన్సీ ప్రాంత రైతులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గోపాల మిత్రల సమస్యలు పరిష్కరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన గోపాలమిత్ర వ్యవస్థను వైసీపీ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ నుంచి రేవేంద్రపాడు వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందనీ, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని గుండిమెడకు చెందిన సరిత విజ్ఞప్తి చేశారు. వారం క్రితం కేఎల్‌యూ వరకు పనులు చేసి అనంతరం నిలిపివేశారన్నారు. ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణ సౌకర్యం ఉండదనీ, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. అలాగే గుండిమెడ పంచాయతీ పరిధిలోని గుంతలు పూడ్చి వీధిలైట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

అమ్మానాన్నలకు ఆహ్వానం

(5 పేజీ తరువాయి)

జారీ చేసింది. పాఠశాలల్లో విద్యాకమిటీ ఎన్నికలు పూర్తి అయ్యాయి. కమిటీ సభ్యుల్ని, తల్లిదండ్రుల్ని పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములుగా చేసి ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రతిగతి, పాఠశాల అభివృద్ధి పర్యవేక్షించేలా కార్యచరణ సిద్ధం చేశారు.

● పాఠశాలలో అభివృద్ధికి అవసరమైన కొనుగోళ్ళ బడ్జెట్, సుందరీకరణ, పర్యావరణ పరిక్షణ, మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయుల అంతర్గత సమస్యలు, మంచినీరు ఇతర అంశాలపై సమావేశంలో చర్చిస్తారు. .

● విద్యార్థుల ప్రగతి, వారి ఆరోగ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు అంటే శారీరక, మానసిక, కంటి సంబంధ సమస్యలు, పౌష్టికాహార లోపం వంటివి ఇందులో నివేదిస్తారు. కొన్నిచోట్లు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

● పాఠశాల పూర్తి అయిన తరువాత ఇంటి వద్ద విద్యార్థుల్ని ఎలా పర్యవేక్షించాలి? సెల్‌ఫోన్, టీవీలు, ట్యాబ్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల వినియోగంపై నియంత్రణ ఎలా ఉండాలి? వంటి అంశాలుచర్చిస్తారు.

● ప్రత్యేక సమావేశాల సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడానికే: డీఈవో రేణుక



పాఠశాలల్లో జరిగే అభివృద్ధి పనుల్లో, విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల్ని భాగస్వాములుగా చేయడానికే ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. ప్రత్యేక సమావేశాలకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఉపాధ్యాయులకు, హెచ్ఎంలకు అందజేశామని వివరించారు. పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రేణుక బుధవారం "ఆంధ్రజ్యోతి"కి వివరించారు.

పరిశోధనలపై అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ ఆచార్య గంగాధరరావు, పీబీ సిద్ధార్థ కళాశాల అధ్యాపకులు

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో పీబీ సిద్ధార్థ కళాశాల బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం వలన పీబీ సిద్ధార్థ కళాశాల, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంప్యూటర్ సైన్సెస్ విభాగాలు సంయుక్తంగా పరిశోధనలు చేయటం, సాంకేతిక సదస్సులు, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు, పాఠ్య ప్రణాళికలు రూపొందించడం, పరిశోధన, నూతన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు, అధ్యాపకులకు బోధించటం, వనరులను వినియోగించుకోవడం, వివిధ సంస్థలకు సేవలు అందించి తద్వారా ఆదాయం చేకూర్చటం వంటి అంశాల్లో రెండు కళాశాలలు కలిసి పని చేయాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో పీబీ సిద్ధార్థ కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మేకా రమేష్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగ అధిపతి డాక్టర్ టి.ఎస్.రవి కిరణ్, ఉప విభాగ అధిపతి కె.సుధీర్ పాల్గొన్నారు.

గిరిజన యువకుడి కిడ్నాప్

● రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్
● కేసును ఛేదించిన అరకులోయ పోలీసులు

అరకులోయ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కిడ్నాపర్ల చెర నుంచి ఓ గిరిజన యువకుడిని పోలీసులు విడిపించారు. అతనిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గంజాయి కోసం జరిగిన ఈ ఘటనకు సంబంధించి నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను అరకులోయ పోలీస్ స్టేషన్‌లో బుధవారం పాడేరు డీఎస్పీ ప్రమోద్ వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండ ప్రాంతానికి చెందిన షేక్ యాసిన్ మూడు నెలల క్రితం అరకులోయ వచ్చాడు. మాడగడకు చెందిన దినేశ్‌కుమార్, ప్రకాశ్, సుశీల్‌కుమార్ అనే గిరిజన యువకులతో యాసిన్ పరిచయం పెంచుకుని తరచూ ఫోన్‌లో సంభాషించే వాడు. తనకు గంజాయి కావాలని ప్రకాశ్, సుశీల్‌కుమార్‌లకు చెప్పాడు. గంజాయి కోసం యాసిన్ తన స్నేహితుడైన సంతోశ్, మరో వ్యక్తిని మాడగడకు గత నెల 22న పంపించాడు. డబ్బులు తీసుకున్న ప్రకాశ్, సుశీల్‌కుమార్ వారి ఫోన్ నంబర్లను బ్లాక్ చేశారు. చేసేది లేక సంతోశ్ తిరిగి వినుకొండ వెళ్లిపోయాడు. విషయమంతా యాసిన్‌కు చెప్పాడు. దీంతో మాడగడ గ్రామానికి యాసిన్, సంతోశ్, మరో వ్యక్తి వచ్చి ప్రకాశ్, సుశీల్‌కుమార్ కోసం గాలించారు. వారి ఆచూకీ లభించకపోవడంతో వారి స్నేహితుడైన దినేశ్‌కుమార్‌ను గత నెల 27వ తేదీన కిడ్నాప్ చేసి వినుకొండకు తీసుకువెళ్లిపోయారు. దినేశ్‌కుమార్‌ను విడిచిపెట్టాలంటే లక్ష రూపాయలు ఇవ్వాలని అతని కుటుంబ సభ్యులను డిమాండ్ చేశారు. దీనిపై దినేశ్‌కుమార్ కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ గోపాలరావు కేసు దర్యాప్తు చేసి బాధితుడు దినేశ్‌కుమార్‌ను కిడ్నాపర్ల నుంచి రక్షించి బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కేసులో వినుకొండకు చెందిన యాసిన్, సంతోశ్, మాడగడకు చెందిన ప్రకాశ్, సుశీల్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో స్వల్ప భూ ప్రకంపనలు

తెనాలి, దాచేపల్లి, సత్తెనపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం కొన్ని సెకన్ల పాటు స్వల్పంగా భూమి కంపించింది. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో రెండుసార్లుగా మూడు నుంచి ఐదు సెకన్ల పాటు కదలికలు కనిపించాయి. తెల్లవారు జామున కట్టేసి ఉంచిన వాషింగ్ మెషిన్లు, ఇతర సామగ్రి కొన్ని సెకన్లపాటు కదలడం, వంట పాత్రల స్టాండ్‌లో శబ్దాలు రావడాన్ని గుర్తించామని ఆయా ప్రాంతాలవాసులు చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలో కొన్ని ప్రాంతాల్లో భూ అలజడి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. మారీస్‌పేట, చెంచుపేట, సుల్తానాబాద్, అమరావతి ప్లాట్స్, కఠెవరం రోడ్డు వెంటున్న నివాసాల్లో ఈ పరిస్థితి ఎదురైంది. పల్నాడు జిల్లా దాచేపల్లిలో బుధవారం ఉదయం 7.40 నిమిషాల సమయంలో 12 సెకన్లు పాటు భూమి కంపించినట్లు నారాయణపురంలోని వైద్యులు సుంకర సత్యనారాయణరెడ్డి తెలిపారు. సత్తెనపల్లిలోని నాగన్నకుంటలో మూడు సెకన్ల పాటు స్వల్పంగా భూమి కంపించిందని ఆ ప్రాంత ప్రజలు, వీఆర్వో అరుణ తెలిపారు. ఉదయం 7.25 గంటల తరువాత భూకంపం వచ్చిందని, ఇంట్లో కుర్చీలు, సామాన్లు కొంత పక్కకు ఒరిగాయని కొంత మంది తెలిపారు.

సికింద్రాబాద్, బ్రహ్మపూర్, విశాఖపట్నంకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పండగల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా సికింద్రాబాద్, బ్రహ్మపూర్, విశాఖపట్నంలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నంబరు. 07027 సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 6, 13, 20, 27(శుక్రవారం) తేదీల్లో రాత్రి 8.15కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా శనివారం మధ్యాహ్నం 2.45కి బ్రహ్మపూర్ చేరుకొంటుంది. నంబరు. 07028 బ్రహ్మపూర్ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 7, 14, 21, 28(శనివారం) తేదీల్లో సాయంత్రం 4.45కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా ఆదివారం ఉదయం 11.35కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నంబరు. 07097 సికింద్రాబాద్ - విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 8, 15, 22, 29(ఆదివారం) తేదీల్లో సాయంత్రం 4.35కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా సోమవారం ఉదయం 6.30కి విశాఖపట్నం చేరుకొంటుంది. నంబరు. 07098 విశాఖపట్నం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 9, 16, 23, 30(సోమవారం) తేదీల్లో రాత్రి 7.50కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 11.15కి సికింద్రాబాద్ చేరుకొంటుంది.

ఎల్‌హెచ్‌బీ బోగీలతో అమరావతి ఎక్స్‌ప్రెస్

వారంలో నాలుగు రోజులు గుంటూరు మీదగా ప్రయాణించే నంబరు. 18047, 18048 షాలిమార్ - వాస్కోడిగామ - షాలిమార్ అమరావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణించనున్నాయి. ఈ నెల 16 నుంచి నంబరు. 18047, 19వ తేదీ నుంచి 18048 రైళ్లు ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణిస్తాయి. దీనివలన కోచ్ కంపోజిషన్ ఒక సెకండ్ ఏసీ, నాలుగు ఏసీ త్రీటైర్, 9 స్లీపర్, నాలుగు జనరల్ బోగీలుగా మారనుంది.

కుమార్తెల దాడిలో తండ్రి మృతి

యడ్లపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధ పడుతున్న తల్లిని సక్రమంగా చూసుకోకపోగా తరచూ మద్యం తాగి వచ్చి ఇబ్బంది పెడుతున్న తండ్రిపై కుమార్తెలు దాడి చేయడంతో తండ్రి మృతి చెందిన సంఘటన యడ్లపాడు మండలం బోయపాలెంలో జరిగింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బోయపాలెం గ్రామానికి చెందిన భూక్యా రెడ్డినాయక్(55), సక్రీబాయి దంపతులు స్థానికంగా కూలి పనులకు వెళ్తుంటారు. వీరికి జ్యోతి, శాంతి కుమార్తెలు కాగా ఇద్దరికీ వివాహాలు చేశారు. సక్రీబాయికి పొట్టలో గడ్డలు రావడంతో కుమార్తెలు చిలకలూరిపేటలోని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. వారం రోజులపాటు చికిత్స పొందిన సక్రీబాయి కోలుకోవడంతో మంగళవారం ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంటికి తాళం వేసి ఉండడంతో తండ్రి కోసం కొద్దిసేపు విచారించి అనంతరం తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లారు. కొద్ది సేపటికి మద్యం తాగి ఇంటికి వచ్చిన తండ్రితో కుమార్తెలు గొడవ పడ్డారు. తల్లి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉంటే పట్టించుకోకుండా తాగి తిరుగుతావా అంటూ ఒకరినొకరు నెట్టుకున్నారు. పక్కనే ఉన్న కర్రలను తీసుకుని తండ్రి తలపై బలంగా కొట్టగా స్పృహ కోల్పోయి కింద పడిపోయాడు. కొద్దిసేపటి తరువాత చూడగా తండ్రి మృతి చెందాడు, బుధవారం ఉదయం బంధువులకు విషయం తెలిసి గొడవ చేయగా చిన్న కుమార్తె 100కు డయల్‌చేసి ఫిర్యాదు చేసింది. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు, రూరల్ సీఐ సుబ్బనాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను విచారించారు. మృతుడి సోదరుని కుమారుడు రమేష్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగదు లెక్కిస్తున్నట్లుగా నటించి రూ.21 వేలు కాజేత

చిలకలూరిపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట సెంటర్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో బుధవారం ఒక పెన్షనర్‌ను మోసం చేసి రూ.21 వేలు కాజేశారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో బిల్లు కలెక్టర్‌గా పనిచేసి రిటైర్ అయిన పురుషోత్తమపట్నంకు చెందిన విడదల హనుమంతరావు స్టేట్ బ్యాంకులో రూ.46 వేలు నగదు డ్రా చేశాడు. నగదు తీసుకుని క్యాష్ కౌంటర్ పక్కకు వచ్చి అక్కడే నిలబడి ఉన్న ఒక వ్యక్తిని డబ్బులు లెక్కించి సహాయపడాలని కోరారు. ఆ వ్యక్తి నగదు లెక్కిస్తున్నట్లుగా నటించి, చేతివాటం చూపి నగదు సరిగానే ఉన్నదంటూ అందులో రూ. 21వేలు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. కొద్దిసేపటి తర్వాత తాను డ్రా చేసిన డబ్బు తగ్గిందంటూ పెన్షనర్ హనుమంతరావు కౌంటర్ వద్దకు వచ్చి ఫిర్యాదు చేశారు. బ్యాంకు సిబ్బంది వెంటనే బ్రాంచి మేనేజర్‌కు ఈ విషయం తెలియజేశారు. సీసీ ఫుటేజ్ పరిశీలించగా నగదు లెక్కించిన వ్యక్తి కొంత నగదును తీసుకుని పరారైనట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని చిలకలూరిపేట అర్బన్ పోలీసులకు బ్యాంకు వారు తెలిపారు. పోలీసులు సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి నగదు దొంగలించిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

జనసేన నేతపై దాడి

సత్తెనపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది కొమ్మిశెట్టి సాంబశివరావుపై బుధవారం రాత్రి దాడి జరిగింది. సాంబశివరావు నాగార్జున నగర్‌లోని తన గృహానికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు సాంబశివరావుపై కర్రతో దాడి చేసి బైక్‌పై పరారయ్యారు. జరిగిన సంఘటనపై సాంబశివరావు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా సోషల్ మీడియాలో కొమ్మిశెట్టి సాంబశివరావు బాగా చురుగ్గా ఉంటున్నారు. దాడి పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 586.90 అడుగులు ఉంది. ఇది 304.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8067, ఎడమ కాలువ ద్వారా 4814, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 14,681 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98,107,118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

33,337 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 35,201 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 33,337 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 41,318 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	8000	14000
నెంబరు. 5	8000	14500	నెంబరు.5	8000	12000
273	9000	10700	273	9000	11500
341	8000	15000	341	8000	14000
4884	16000	16000	4884	--	--
సూపర్ 10	-	-	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16500	తేజ	7500	16500
బ్యాడిగి	7500	14000	బ్యాడిగి	7500	12500
దేవనూరు డీలక్స్	8500	13000	దేవనూరు డీలక్స్	9000	10500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4000	10000

ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి

బాపట్లరూరల్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగిఉండాలని బాపట్ల పట్టణ సీఐ అహ్మద్ జానీ అన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు రోడ్డుభద్రత నియమాలపై ఆటోడ్రైవర్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. ఆటోకు సంబంధించిన అన్ని రికార్డుల జిరాక్స్ కాపీలను వెంట ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదన్నారు. మద్యం సేవించి ఆటోలను నడపరాదన్నారు. రోడ్డుభద్రతా నియమాలు పాటిస్తూ నేరనియంత్రణ లో పోలీసు వారికి సహకరించాలని సూచించారు.

7న 5కె, 3కె, 2కె రన్ క్రీడా పోటీలు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఖాజీపాలెం కేవీ ఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 7న నిర్వాహకులు మంతెన వెంకటరాజు సేవాసమితి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన చంపాటి చిన సూరపురాజు, సౌభాగ్యమ్మ సొసైటీ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి పురుషుల 5కె రన్, బాపట్ల నియోజకవర్గ పరిధిలోని ఉన్నత పాఠశాలల సీనియర్ బాలుర 3కె రన్, బాలికల 2కె రన్ క్రీడా పోటీలను నిర్వహించటం జరుగుతుందని కళాశాల పాలకవర్గ నిర్వాహకులు తెలిపారు. 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు కేవీఆర్‌కేవీఆర్ అండ్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9440529307, 9059808491ను సంప్రదించాలని తెలిపారు.

7న క్రీడా వార్షికోత్సవం

మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల 44వ క్రీడా వార్షికోత్సవం, డాక్టర్ డీఎస్ రాజు జూనియర్ కళాశాల 28వ క్రీడా వార్షికోత్సవం, వైద్యరాజు, వేగిరాజు కృష్ణంరాజు 115వ జయంతిని ఈనెల 7న మధ్యాహ్నం నిర్వహించటం జరుగుతుందని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ టి.శివప్రసాద్, బీహెచ్ సుబ్బరాజు తెలిపారు.

కర్లపాలెంలో వాహన తనిఖీలు

కర్లపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలో ఎస్ఐ రవీంద్ర తన సిబ్బందితో కలిసి బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. చందోలు నుంచి బాపట్ల వెళ్లే వాహనాలు, బాపట్ల నుంచి చందోలు వైపు వచ్చే వాహనాలను ఎస్ఐ రవీంద్ర తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలలో భాగంగా వాహనాలను తనిఖీ చేశామని తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు చేపడతామని అన్నారు.

పచ్చిమిరప తోటలకు శ్రీకారం

కర్లపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎం.వి.రాజుపాలెంలో బుధవారం పొలాలలో పచ్చిమిరప మొక్కలు నాటేందుకు మహిళా కూలీలు శ్రీకారం చుట్టారు. మండలంలోని పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం, ఎంవీ రాజుపాలెం, నల్లమోతువారిపాలెం, కర్లపాలెం, దమ్మనవారిపాలెం, యాజలి, దుండివారిపాలెం తదితర గ్రామాలలో పచ్చిమిరప పైర్లు వేసేందుకు రైతాంగం పొలాలను సిద్ధం చేస్తున్నారు.

ఫోక్సో కేసుపై పోలీసుల విచారణ

బాపట్లరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచార ఘటనలో నగరం మండలంకు దేవరకొండపాలేనికి చెందిన కాగిత వినయ్‌కుమార్‌పై బాపట్లరూరల్ పోలీసులు ఈనెల 1వ తేదీన ఫోక్సో కేసును నమోదు చేశారు. అయితే నిందితుడి తండ్రి తన పూచిపై ఇంటికి తీసుకెళ్ళగా మరుసటి రోజు పోలీసుస్టేషన్‌కు రాలేదు. నిందితుడు పరారీ అవ్వటంతో పూచిపై తీసుకెళ్ళిన నిందితుడి తండ్రిని విచారణ చేపడుతున్నట్లు రూరల్ సీఐ గంగాధరరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బాపట్లరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేయటం జరుగుతుందని పట్టణ ఏఈ సాయిశ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని తెలిపారు.

వర్షంతో వరికి అపార నష్టం : సీపీఎం

బాపట్లరూరల్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తుఫాన్ కారణంగా జిల్లాలో వరికి అపార నష్టం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 35 వేల ఎకరాలలో వరి పంట నీట మునిగిందని, ఆ పంటను ఒడ్డున చేర్చుకునేందుకు రైతులు అదనపు ఖర్చు భరించాల్సి వస్తుందన్నారు. రైతులకు ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి

రేపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులపై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి అన్నారు. బుధవారం పేటేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వంద రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బాలల హక్కులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, సూపర్‌వైజరు వెంకటరత్నమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేషనల్ వెయిట్ లిఫ్టింగ్‌లో అరుణ్ణినేష్‌కు తృతీయ బహుమతి

రేపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తమ కళాశాల విద్యార్థి అరుణ్ణినేష్ సౌత్ వెస్ట్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ యూనివర్సిటీ పోటీల్లో తృతీయ స్థానం సాధించినట్లు ఎస్వీ ఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ వల్లభనేని బుచ్చియ్య చౌదరి బుధవారం తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న పోటీల్లో 297 కేజీల బరువును ఎత్తిన అరుణ్ణినేష్ తృతీయ స్థానంలో విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో ఎకడమిక్ డైరెక్టర్ వి వెంకటేశ్వరరావు, అమరేష్‌రెడ్డి, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

● ఎస్పీ తుషార్ డూడి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి పర్యటనలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటన వివరాలను వెల్లడించటానికి కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 7వ తేదీన బాపట్లకు రానున్నారని తెలిపారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి బాపట్ల జిల్లాలో ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలోను ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. విద్యార్థుల సమగ్రప్రగతి పత్రాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చిస్తారన్నారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించే విద్యార్థులు 919 మంది ఉన్నారన్నారు. కేవలం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఎంపిక చేసిన పూర్వవిద్యార్థులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరవుతారని స్పష్టం చేశారు. అర్ధాంతరంగా నిలిచిన పాఠశాల భవన నిర్మాణాలను మొదట సీఎం పరిశీలిస్తారన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారన్నారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ముఖ్యంగా హెలిప్యాడ్, బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఉంటుందన్నారు. బాపట్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ఆహ్వానపత్రాలు, పాస్‌లు ఉన్న వారిని మాత్రమే సభా ప్రాంగణంలోకి అనుమతిస్తామన్నారు. సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ నష్టం.. అన్నదాతకు కష్టం

● తేమకు సడలింపులు ఇచ్చినా.. రైతులకు ఇబ్బందులే
● నేడు జంపనిలో ధాన్యం సేకరణ కేంద్రాన్ని పరిశీలించనున్న ఇన్‌చార్జి మంత్రి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఫెంగస్ తుఫాన్ ప్రభావం చివరి మూడు రోజుల్లో జిల్లాపై ప్రభావం చూపడంతో వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరిపైరు కోతకు సిద్ధంగా ఉన్న దశలో కురిసిన వర్షాలు రైతులు దిక్కుతోచని స్థితిలో పడేశాయి. ఇదిలా ఉంటే వేల ఎకరాల్లో వరిపైరు నేలవాలడంతో ఎకరాకు దిగుబడి విషయంలో గణనీయంగా తేడా వచ్చే అవకాశాలు ఉంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ దాదాపు 18,000 ఎకరాల్లో వరి కోతలు పూర్తయి ధాన్యం చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించినది 1900 టన్నులే కావడం గమనార్హం. దాదాపు 5,000 టన్నులు బహిరంగ మార్కెట్‌కు తరలిందనేది క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. తుఫాన్ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును పరిశీలించడానికి గురువారం ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి వేమూరు మండల పరిధిలోని జంపనికి రానున్నారు. జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ కూడా ఆయన వెంట ఉంటారనేది సమాచారం. మంత్రుల రాకతో క్షేత్రస్థాయిలో ధాన్యం అమ్మకాల విషయంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం దొరుకుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. మిల్లులలో డ్రయ్యర్లు లేకపోవడం అన్నదాతలకు ఇబ్బందిగా మారింది. కేవలం 28 మిల్లుల్లోనే అందుబాటులో ఉండడం వాటిలో కూడా కొన్ని పనిచేయకపోవడం తేమ శాతం విషయంలో ఇబ్బందులకు కారణమైంది. డ్రయ్యర్లు అన్ని మిల్లుల్లో అందుబాటులో ఉంటే గంటల వ్యవధిలోనే ధాన్యం ఆరబోతకు వీలుండేదని, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ వరుణుడు వైపు చూస్తూ ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉందనేది రైతుల ఆవేదన. ధాన్యంసేకరణ ఎక్కువగా వేమూరు నియోజకవర్గ పరిధిలోనే ఉంటుంది. కానీ ఎక్కువ కెపాసిటీ కలిగిన మిల్లులు ఇక్కడ లేకపోవడం కూడా రైతులకు ఇబ్బందిగా మారింది. నిబంధనల విషయంలో సడలింపులు ఇచ్చామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో అన్నదాతలు దళారులనే ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదనుగా వారు 75 కేజీల బస్తాకు కేవలం రూ.1350 మాత్రమే చెల్లిస్తూ రైతులను నిలువునా వంచిస్తున్నారు. మిల్లర్లు తీసుకున్న బ్యాంక్ గ్యారెంటీలలో ఇప్పటికే చాలా వరకు పరిమితి దాటింది. దీంతో తమకు దగ్గరగా ఉండే మిల్లులో ధాన్యం ఇచ్చే వెసులుబాటు రైతులకు లేకుండా పోయింది.



వేమూరులో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

వర్షాలకు కుదేలవుతున్న రైతులు

● రోడ్లపై భద్రపరచగా తడిసిన ధాన్యం బస్తాలు

వేమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారు. వర్షంతో పాటు గాలులు వీచడం వల్ల కోతకు సిద్ధమైన పైర్లు పూర్తిగా పడిపోయాయి. గింజ రాలి పోతోంది. లేతపైర్లు కంకి బిగిసే దశలో వర్షాలు పడటం వల్ల గింజ గట్టిపడకుండా తాలుగా ఏర్పడుతుంది. రోడ్లపై ఆరబోసిన ధాన్యం ఎన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ వర్షపు నీరు చేరి మొలకలు వచ్చాయి. రోడ్ల వెంట భద్రపరిచిన ధాన్యం బస్తాలు కూడా తడిసిపోయాయి. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి భారీగా కురిసిన వర్షానికి కొద్దో గొప్పో ఆశపెట్టుకున్న పైర్లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోశయ్య వర్ధంతి



వేమూరులో రోశయ్యకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నేతలు

వేమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన వేమూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కలవ వెంకటరాధా మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీపీ బొలిశెట్టి ప్రభాకరరావు మాట్లాడుతూ, రాజకీయ రంగంలో కీర్తిని ఆర్జించిన నాయకుల్లో రోశయ్య ఒకరిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని రోశయ్య విగ్రహానికి, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోని విగ్రహానికి సంఘీయులతో పాటు పలువురు గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారు నంబూరు గాంధీ, గౌరవాధ్యక్షుడు కొలిపాకుల మస్తాన్‌రావు, ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటసుబ్బయ్య ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్మూరి కిషోర్, గోనుగుంట్ల మురళి, కొలిపాకుల శివశంకర్, అత్తోట శ్రీను, నంబూరు శంకర్, కొమ్మూరు సాయి, మణికంఠ, రోశయ్య సన్నిహితులు నాటక ప్రయుక్త దాసరి ముత్తయ్య, వైసీపీ నాయకులు కోగంటి లవకుమార్, దున్నా మేరీసు బాబు, రోశయ్య అభిమాని కొల్లిపర శ్రీరామ్మూర్తి పాల్గొని నివాళులర్పించారు.

● అమృతలూరు, డిసెంబరు, (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని గోవాడ ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రం కోసం రోశయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు, రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొత్తమాసు వెంకటరమణకుమార్, శిఖాకొల్లి తాండవకృష్ణ, కె.మురళీకృష్ణ, తమ్మన సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ఘంటసాల జయంతి మహోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గాన గంధర్వుడు ఘంటసాల జయంతి మహోత్సవాన్ని అభిమానులు ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు మిని ట్యాంక్‌బండ్ వద్ద బుధవారం ఘంటసాల 102వ జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అభిమాని వంగర చలమయ్య సిద్ధాంతి ఘంటసాల గీతాలను ఆలపించారు. వివేకానంద విగ్రహ సాధన కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు, ఘంటసాల జీవిత చరిత్రను డాక్యుమెంటరీగా తీస్తున్నారని చెప్పారు. అనంతరం సిద్ధాంతి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రావూరి సత్యనారాయణమూర్తి, చిదంబరం, వెంకట ఉమామహేశ్వరరావు, తిరువీదుల బుల్లబ్బాయి, వంగర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో అవగాహన పెంపొందించుకోవాలి : డీడీఏ



సూచనలు చేస్తున్న డీడీఏ విజయనిర్మల

చుండూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగు విషయంలో రైతాంగం అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వనరుల కేంద్ర డీడీఏ విజయనిర్మల అన్నారు. నేల భూసారం, పంటల ఎంపిక, విత్తనాల నాణ్యత, ఎరువుల వాడకం, వాతావరణ పరిస్థితులు, మార్కెటింగ్ వంటి విషయాలలో రైతాంగం పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. వేటపాలెంలో బుధవారం జరిగిన పొలంబడిలో ఆమె మాట్లాడుతూ, రబీలో మొక్కజొన్న లాభసాటిగా దిగుబడులు సాధించడం కోసం మేలైన యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక ప్రధానమన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జన్నమ్మ నిమ్మతోటలలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మి, ఏవో ఆదాంబాబు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో బలుసులపాలెం వీఆర్వో మృతి



అబ్దుల్ అజీజ్(ఫైల్)

చెరుకుపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలుసులపాలెం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ అజీజ్ బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం నగరం మండలం చినమట్లపూడి. అజీజ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు సుజాత, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాపట్లలో ఇంతవరకు ఎటువంటి అభివృద్ధి జరగలేదు

● మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి



మాట్లాడుతున్న గాదె వెంకటరెడ్డి

బాపట్ల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గడిచిన 10 సంవత్సరాలు నుంచి బాపట్ల నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. బాపట్లలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు బాపట్లలో ప్రధానంగా డ్రైనేజి సమస్యలను పట్టించుకోలేదన్నారు. అదేవిధంగా గ్రామాలలో ఎక్కువగా తాగునీటి సమస్య ఉందన్నారు. గడిచిన 5 సంవత్సరాలలో బాపట్లలో ఎక్కువగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయని వీటిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి కూడా ఫిర్యాదు చేయటం జరిగిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అధికారంలో ఉన్నప్పుడు మెడికల్ కళాశాల నిర్మాణం విషయంలో కేటాయించిన ఆసైన్డ్ భూముల విషయంలో కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడటం జరిగిందన్నారు. అదేవిధంగా పేదలకు పంపిణీ చేసే ఇళ్ళ స్థలాల విషయంలో కూడా అవినీతికి పాల్పడటం జరిగిందని వీటిపై వైసీపీ అధిష్ఠానం సమగ్ర విచారణ చేపట్టాలని తెలిపారు. గతంలో చేసిన తప్పులను గుర్తించి వైసీపీ బలోపేతానికి జగన్మోహనరెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

బాపట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం 1973-1976వ సంవత్సరం బికాం విద్యార్థుల మూడో సమావేశం స్థానిక హోటల్ గౌతమ్‌లో నిర్వహించారు. ఆనాడు విద్య నేర్పిన ఆధ్యాపకులు వి.వెంకటసుబ్బారావు, కొంపల్లి శేషతల్పసాయిలను వేదికపైకి ఆహ్వానించి దుశ్శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 40 మంది పూర్వవిద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 48 సంవత్సరాలు క్రితం విడిపోయి వివిధ వృత్తులను చేపట్టి పదవీవిరమణ పొందిన వారందరు తమ వయసును మరిచిపోయి బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు వెళ్ళి గత స్మృతులను గుర్తు చేసుకుంటూ తాము చదువుకున్న గదులలో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో భుజగేంద్రమౌళి, శ్రీహరి, రామవరావు, ఎస్‌బి మౌళి, మనోహర్, ఆంజనేయ వరప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో గుజరాత్ బెటాలియన్ క్యాంప్

కర్లపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని జాతీయ రహదారి పక్కన పొలాలలో గుజరాత్ బెటాలియన్ 70 మంది సిబ్బంది బుధవారం గుడారాల ద్వారా శిబిరం ఏర్పాటు చేసుకున్నారు. బాపట్లలోని సూర్యలంకలో ఉన్న ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు సహకారం అందించేందుకు పది రోజులుపాటు ఇక్కడ క్యాంప్ ఏర్పాటు చేసుకున్నామని క్యాంప్ సెక్యూరిటీ నిర్వాహకులు పృథ్వీరాజ్ తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : రూరల్ సీఐ

రేపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాలలను రక్షించే క్రమంలో పోలీసులు ముందంజలో ఉంటారని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని రూరల్ సీఐ ఆర్.సురేష్ బాబు అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల డెవలప్‌మెంటు చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల లెవల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.రత్నశ్రీధర్, ఉప తహసీల్దారు నిరంజన్‌బాబు, చైల్డ్ డెవలప్‌మెంటు ఆఫీసరు ఎం.సుచిత్ర పాల్గొన్నారు.

● కొల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఉంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి బుధవారం అన్నారు. కొల్లూరులోని 7వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

హిందువులపై దాడి హేయమైన చర్య

నగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ నాయకుడు రాంపల్లి జగన్నాధశాస్త్రి అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడికి నిరసనగా బుధవారం రేపల్లె పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందువులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి దాడులు అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.సాంబశివరావు, బేతపూడి వెంకటేశ్వరరావు, అన్నం సాయివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి వలస కూలీ మృతి

దక్కిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో పిడుగు పడి వలస కూలీ మృతి చెందిన ఘటన దక్కిలి మండలం శ్రీపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకొంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.... నిజాంపట్నం మండలం, అడవుల దీవి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ (30) వారం రోజుల క్రితం భర్త వెంకటేశ్వరరావుతో కలిసి వరినాట్లు వేసేందుకు శ్రీపురం గ్రామానికి వచ్చారు. బుధవారం పొలాల్లో వరినాట్లు వేస్తుండగా వెంకటేశ్వరమ్మపై పిడుగు పడడంతో ఆమెను వెంటనే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకటేశ్వరమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్వరరావు దంపతులకు ఐదేళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉన్నారు.



ఆర్ అండ్ బీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

● ఆర్ అండ్ బీ శాఖ సమీక్షలో ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో ఆర్ అండ్ బీ శాఖ ద్వారా చేపట్టిన పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అధికారులను ఆదేశించారు. గుంటూరు క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆర్ అండ్ బీ శాఖ అధికారుల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనందబాబు అధికారులతో మాట్లాడుతూ, జీవో నెంబరు 53, 349లలో వేమూరు నియోజకవర్గంలో గుంతలు పూడ్చే పనులు ఎన్ని శాంక్షన్ అయ్యాయి, వాటిలో ఎన్నింటిని ప్రారంభించారు, ఎన్నింటిని పూర్తి చేశారని ప్రశ్నించారు. అలాగే పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు పునః నిర్మించేందుకు ఎన్ని పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపారని అడిగారు. అధికారులు సమాధానం ఇస్తూ గుంతల పనులు 15 ప్రారంభించినట్లు వాటికి గాను రూ.6.50 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అలాగే రెండు ప్రధానమైన రోడ్లు పునఃనిర్మాణానికి రూ.9 కోట్ల నిధులు మంజూరు చేయాలని హెచ్‌వోడీకి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. సంబంధించిన పనుల వివరాల రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇంకా ఏమైనా పనులు చేపట్టాల్సి ఉంటే వాటికి సంబంధించిన అంచనాలతో కూడిన ప్రతిపాదనలను వెంటనే తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ ఈఈ గీతారాణి, డీఈ వేణుగోపాల్, ఏఈ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును కార్యకర్తలు బాధ్యతగా తీసుకోవాలి

కొల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్యకర్తలు బాధ్యతగా తీసుకుని పని చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ, భవిష్యత్‌లో జరిగే నీటి సంఘాల సొసైటీ ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మార్కెట్ యార్డు పాలకవర్గాల నియామకాలు ఉంటాయని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని, ఆ బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఇప్పటి వరకు మండలంలో పార్టీ సభ్యత్వాలు బాగా నమోదు అయ్యాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, యలవర్తి కోటేశ్వరరావు, ధూళిపూడి కృష్ణ, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

కార్యకర్తలను అభినందించిన ఎమ్మెల్యే

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులో సభ్యత్వ నమోదుకు కృషి చేసిన కార్యకర్తలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అభినందించారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను బుధవారం కార్యకర్తలు కలిసి భట్టిప్రోలు గ్రామంలో పార్టీ సభ్యత్వాలు 2800 చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, డొక్కు శ్రీనివాసరావు, షేక్ ఇంతియాజ్, కొర్నెపాటి లోకానంద్, ఆదిన తాండవకృష్ణస్వామి, అర్జునరావు, సాయికిరణ్, సనత్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సు ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో బుధవారం ఆయన వీక్షణా సమావేశాన్ని నిర్వహించగా బాపట్ల జిల్లా నుంచి కలెక్టర్ జె.వెంకటమురళి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల వారీగా తహసీల్దార్‌లు షెడ్యూలు ప్రకటించుకోవాలన్నారు. రీసర్వే పూర్తికాని రెవెన్యూ గ్రామాలలో ముందస్తుగా సదస్సులు నిర్వహించటానికి ప్రణాళికలు రూపొందించామని రెవెన్యూ శాఖా మంత్రి, సీసీఎల్ఏ ప్రిన్సిపాల్ సెక్రటరి దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. జిల్లాలో 277 రెవెన్యూ గ్రామాలు ఉండగా 71 గ్రామాలలో రీసర్వే పూర్తయిందన్నారు. మిగిలిన 266 గ్రామాలలో రీసర్వే జరుగుతోందన్నారు. రీసర్వేపై నిర్వహించిన సభలలో 4,230 అర్జీలు ప్రజలు నుంచి వచ్చాయన్నారు. అందులో 1009 అర్జీలు కేవలం రెవెన్యూకు సంబంధించినవేనన్నారు. వీటిలో 40 శాతం అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించామన్నారు. మిగిలినవి సర్వేకు సంబంధించిన ఫిర్యాదులేనన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రెవెన్యూ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి మండల పరిధి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుశీల తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, అపరిష్కృతంగా ఉన్న రైతుల భూముల సమస్యలపై తక్షణ పరిష్కారం నిమిత్తంగా సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం కుచ్చెళ్లపాడు, పెనుమర్రు, 10న పెరవలి, 12న పెరవలిపాలెం, 16న వరహాపురం, 18, 19 తేదీల్లో వేమూరు, 21, 23 తేదీల్లో జంపని, 26న చదలవాడ, 28న చావలి, 31న అబ్బనగూడవల్లి, జనవరి 3న బలిజేపల్లి, 7న పోతుమర్రు, పులిచింతల గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందించాలన్నారు.

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతిలోని వెంకటపాలెం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో 25 ఎకరాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించిన విషయం తెలిసిందే. అయితే, ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడం ఆలయానికి ఒక ప్రాకారం మాత్రమే నిర్మించింది. తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి రావడంతో ఈ ఆలయం అభివృద్ధి పనులు పూర్వపు ప్లాన్ ప్రకారమే తిరిగి ప్రారంభం కానున్నాయి.


భక్తులు సమకూర్చిన వివిధరూపాల వాహనాలు


నిర్మితమై పూజలందుకుంటున్న వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయం


వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయ మాడ వీధులు


ఆలయం ఆవరణలో శ్రీవారి తులాభారం

శ్రీవారి ఆలయానికి.. మహర్దశ


వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం


ఆలయ ప్రవేశ ముఖద్వారం


విశాలమైన పార్కింగ్

- పూర్వపు ప్లాన్ ప్రకారమే పనులు
- పనులకు అడ్డుగా 'సుజల' ప్రధాన వాటర్ ప్లాంట్
- వేరేచోటుకు త్వరగా మార్చాలంటున్న టీటీడీ అధికారులు

తుళ్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వంలో సూచించిన ప్లాన్ ప్రకారమే తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో మండలంలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణపు అభివృద్ధి పనులు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ఆలయం నిర్మాణం జరిగి భక్తులకు స్వామి వారి దర్శనం లభిస్తున్న సంగతి తెలిసిందే. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీడ్ రోడ్డుకి ఆనుకొని 25 ఎకరాలు ఆలయ నిర్మాణానికి కేటాయించి శంకస్థాపన చేశారు. పనులు మొదలు పెట్టారు. అందుకు రూ.134 కోట్లు టీటీడీ తరపున కేటాయించింది. ఎన్నికల సమీపించడంతో ఆ నిర్మాణపు పనులు ఆగిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక ప్రాకార నిర్మాణాన్ని రూ.32 కోట్లతో చేపట్టి పూర్తి చేసి 'మమ' అనిపించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో పూర్వపు ప్లాన్ ప్రకారమే ఆలయ అభివృద్ధి పనులు చేసేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఈ ప్లాన్ ప్రకారం నాలుగు ప్రాకారాలను ఏర్పాటు చేయనున్నారు. 25 ఎకరాలలో రెండు ఎకరాలు ఆలయ నిర్మాణానికి, మిగిలిన 23 ఎకరాలో కోనేరు, అర్చకులు, స్టాఫ్ క్వార్టర్లు వాహన మండపం, స్వామి అర్చనకు పూలతోట, గెస్ట్ హౌస్‌లు కడుతున్నట్టు టీటీడీ అధికారులు చెబుతున్నారు. 25ఎక రాల చుట్టూ ప్రహరీ నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. దర్శనానికి పెరుగతున్న భక్తుల సంఖ్య స్వామి దర్శనానికి రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోంది. బస్సు సౌక ర్యం కూడా ఆర్టీసీ కల్పించింది. ప్రతి రోజూ అన్నదానం కార్యక్రమాన్ని దాతల సహకరాంతో టీటీడీ నిర్వహణలో జరుగుతోంది.

నిర్మాణపు పనులకు అడ్డుగా ప్రధాన వాటర్ ప్లాంట్

స్వామి వారి ఆలయం ఆవరణలో ఎన్టీఆర్ సుజల పథకం ప్రధాన వాటర్ ప్లాంట్ ఉంది. ఇక్కడ నుండే రాజధాని గ్రామాలకు శుద్ధ జలం వాటర్ ట్యాంకులతో పంపిణీ చేస్తున్నారు. టీటీడీకి భూమిని కేటాయించక ముందే అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. శ్రీవారి ఆలయ నిర్మాణానికి అనుకూలమైన స్థలమని ఎన్టీఆర్ సుజల పథకం ప్లాంట్ ఉన్న ప్రదేశంలో 25 ఎకరాలు టీడీపీ ప్రభుత్వమే కేటాయించింది. ఇప్పుడు ఆలయ అభివృద్ధి పనులకు సుజల పథకం వాటర్ ప్లాంట్ అడ్డుగా ఉండటంతో దీనిని మరోచోటుకి తరలించాలని ప్రభుత్వానికి టీటీడీ తెలియజేసింది. ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభంకానున్న నేపథ్యంలో దీనిని వేరేచోటుకు ఎంత తొందరగా మారిస్తే అంత తొందరగా పనులు ప్రారంభమవుతాయని టీటీడీ చెబుతోంది.

అట్లాంటా మహాలక్ష్మి దేవస్థానానికి బంగారు కమలాలు



వేమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని సత్య శిల్పశాల శిల్పులు దేవమయాచార్య, నాగమయ నారాయణచార్య తయారు చేసిన బంగారు కమలాలను అట్లాంటా మహాలక్ష్మి దేవస్థానానికి బుధవారం పంపారు. దేవస్థానం ట్రస్టు ఇచ్చిన ఆర్డర్‌పై అమ్మ వారికి బంగారు కమలాలను తమ ప్రతిభను చాటుతూ అత్యంత సుందరంగా మలిచారు. ఒక్కొక్క కమలం 33 గ్రాములు చొప్పున మూడు కిలోల 600 గ్రాముల బంగారంతో 108 బంగారు కమలాలను తయారు చేశారు. రూ.2.25 కోట్ల విలువ చేసే కమలాలను ట్రస్ట్ సభ్యుల ద్వారా అట్లాంటా దేవస్థానానికి పంపారు. అతి సుందరంగా కమలాలను తయారు చేసిన శిల్పులకు ట్రస్ట్ సభ్యులు అభినందనలు తెలిపారు.


శిల్పులు దేవుమయాచార్య, నాగమయ నారాయణచార్య

బీసీ కార్పొరేషన్‌కు... 'రుణ' కళ

● లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

(5వ పేజీ తరువాయి)

ముఖ్యంగా ఆదరణ పథకం, వెనకబడిన తరగతుల అభివృద్ధి కార్పొరేషన్ కింద రుణాలు, వాహనాలను రాయితీపై అందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల పాలనలో దాదాపు 40,000 మందికి రూ.800 కోట్ల లబ్ధిని బీసీలకు చేకూర్చిన ఘనత అప్పటి టీడీపీ ప్రభుత్వానిది. కానీ 2019లో వైసీపీ గద్దెనెక్కగానే ఈ పథకాలన్నింటికి గ్రహణం పట్టించడంతో పాటు బీసీ కార్పొరేషన్‌ను నిర్వీవం చేసేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయితీ రుణాలకు నోచుకోని వెనకబడిన వర్గాల ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారు.

ప్రస్తుతం నిధుల కేటాయింపు...

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే బీసీలకు ఏ విధంగా లబ్ధి చేకూర్చాలనే అనే అంశంపై దృష్టి పెట్టింది. దానికి అనుగుణంగానే జిల్లాల వారీగా నిధులు కేటాయింపుతో పాటు లబ్దిదారుల సంఖ్యను కూడా ప్రకటించింది. గుంటూరు జిల్లాకు సంబంధించి ఏడాది వ్యవధిలో రూ.69 కోట్లను వెనకబడిన వర్గాల రుణాల కోసం రాయితీల రూపంలో అందించాలని కేటాయింపులు జరపడంతో పాటు 4,490 మందికి ఈ నిధుల ద్వారా లబ్ది చేకూర్చాలని సంకల్పించింది. అదే విధంగా బాపట్ల జిల్లాకు గాను రూ.47.60 కోట్లు కేటాయించిన పాలకులు 2,875 మందికి లబ్ది చేకూర్చేలా ప్రణాళికలు రచించారు. ఇక పల్నాడు జిల్లాకు వచ్చేసరికి 3,691 మంది లబ్దిదారులకు గాను రూ.58 కోట్లను ఖర్చు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలు కాగా డిసెంబరు రెండో వారం నుంచి లబ్ధిదారుల ఎంపికను చేపట్టే దిశగా అడుగులు వేయనున్నారు

మహిళలు, చేతివృత్తులు...

రాయితీ రుణాలలో అగ్ర తాంబూలం మహిళలతో పాటు చేతివృత్తుల వారికే కేటాయించే విధంగా మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించడంతో పాటు నైపుణ్యంపై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇక మహిళల విషయానికి వచ్చేసరికి బ్యూటీషియన్ విభాగంతో పాటు మగ్గం, కంప్యూటర్ ఇతర నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారికి రాయితీ రుణాలు అందించి సొంతకాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం వారికి అండగా నిలవనుంది.

రైల్వేలో గుర్తింపు సంఘాల పోలింగ్ ప్రారంభం

● తొలి రోజున 2,520 మంది ఓటుహక్కు వినియోగం
● 12న డీఆర్ఎం ఆఫీసులో ఓట్ల లెక్కింపు

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో గుర్తిం పు సంఘాల కోసం ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. బుధవారం ఉదయం నుంచి గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకోవడం మొదలు పెట్టారు. 5, 6 తేదీల్లోకూడా పోలింగ్ జరగనుంది. మొత్తం 4,507 మంది ఓటర్లకు గాను తొలి రోజున 2,520 మంది ఓటుహక్కుని వినియోగించుకొన్నారు. గుంటూరు నగరంలోని రైల్ మహల్‌లో 703, డీఆర్ఎం ఆఫీసులో 598 మంది ఓటు వేశారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, దక్షిణ మధ్య రైల్వే మజ్దూరు యూనియన్‌లో ఓటు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి తమకు మద్దతు ఇవ్వాలని ఉద్యోగులను అభ్యర్థించాయి. సంఘ్ డివిజనల్ సెక్రెటరీ రమణయ్య, మజ్దూరు యూనియన్ డివిజనల్ కార్యదర్శి ఎంపీ ప్రసాద్‌లు తమ యూనియన్ల నాయకులు, సభ్యులతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు.


రైల్‌మహల్ వద్ద ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఉద్యోగులు

8 మంది యువకుల అరెస్టు

2.27 కిలోల గంజాయి స్వాధీనం

కొల్లిపర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగడంతో పాటు విక్రయిస్తున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి 2.27 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి రూరల్ సీఐ బెల్లంకొండ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కొల్లిపర పోలీసుస్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన సీఐ కేసు వివరాలు తెలిపారు. కొల్లిపర మండలం పిడపర్తిపాలెం లాకుల ఎదురుగా పుష్కర ఘాట్ వద్ద ఎనిమిది మంది యువకులు గంజాయితో ఉన్నట్లు సమాచారంతో ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నున్న 2.27 కిలోల గంజాయిని, 3 వేల నగదును, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిశాకి చెందిన అప్పారావు, విజయవాడకు చెందిన గౌతమ్, దీపక్, కొల్లిపర మండలం తూములూరుకి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


నిందితులను అదుపులోకి తీసుకున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కోటేశ్వరరావు

కార్మికవర్గ సమస్యలపై సమీక్ష నిర్వహించాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని, పలు ప్రాజెక్టులపై నిరంతరం సమీక్షలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో దీర్ఘకాలికంగా నెలకొన్న కార్మికవర్గ సమస్యలపై కూడా సమీక్షించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికశాఖలో నెలకొన్న ఖాళీలను భర్తీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది కార్మికులు గత 15 సంవత్సరాలుగా పెరుగుదల లేని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. ఇసుక కొరత, సంక్షేమ పథకాలు అందక రాష్ట్రంలో లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుపై కూడా ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ గిట్టుబాటు ధరపై చట్టం చేయాలని రైతులు చేపట్టిన పాదయాత్రను కేంద్రం అడ్డుకోవడం సరైనది కాదన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను విడనాడలన్నారు. సమావేశంలో కోట మాల్యాద్రి, రావుల అంజిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావులపల్లి రవీంద్రనాథ్

కనుల పండువగా కల్లిపాడు


కన్నమదాసు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

వీరుల దేవాలయం అభివృద్ధికి కృషి

◆ పల్నాటి చరిత్రను దేశమంతటా విస్తరింపజేస్తాం
◆ రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి రవికుమార్

స్థానిక వీరుల దేవాలయం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వీరారాధన ఉత్సవాల్లో చివరిరోజున నిర్వహించిన కల్లిపాడులో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వీరారాధన ఉత్సవాల్లో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వీరులను స్మరించుకుంటూ చేసే ఉత్సవాలను భారతదేశంలో కారంపూడిలో మాత్రమే నిర్వహిస్తారన్నారు. సమసమాజ స్థాపనకు బ్రహ్మానాయుడు కుల, మతాలకు అతీతంగా ఆ రోజుల్లోనే సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వీరుల దేవాలయం, చెన్నకేశవస్వామి, అంకాళమ్మ అమ్మవారి ఆలయంలో మంత్రి, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ఎం అశోక్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కన్నమదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారుతో కలిసి కొణతముల గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఎడ్ల బండలాగుడు పోటీలు, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

❖ ముగిసిన వీరారాధన ఉత్సవాలు
❖ పోతురాజుగుట్ట వద్ద తంగెడ మండలపై ఒరిగిన కొణతములు

కారంపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాల్లో చివరిరోజైన బుధవారం కల్లిపాడులో భాగంగా లంకన్నకు ప్రాణప్రతిష్ఠ చేసే కార్యక్రమం నిర్వహించారు. యుద్ధ భూమిలో లంకన్న ఒరుగు బండపై యాదవ సామాజికవర్గానికి చెందిన వీరాచారవంతుడు శవంగా తెల్లబట్టలు కప్పుకొని పడుకొని ఉండగా పైన బాణాలు ఉంచారు. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు వీరుల సేవా స్థానానికి ఊరేగింపుగా వచ్చి తొలుత కొణతములకు ఊరేగింపు జరిపారు. లంకన్న ఒరిగిన ప్రదేశానికి చేరుకొని ఆనాడు బ్రహ్మనాయుడు తులసితీర్థమిచ్చి ప్రాణప్రతిష్ఠ చేసిన విధంగా నాటకీయంగా నిర్వహించారు. వీర విద్యావంతులు లంకన్న ఒరుగు కథను గానం చేస్తుండగా, కొందరు వీరాచారవంతులు కత్తిసేవ చేశారు. వీరాచారవంతుడు వేకువ జామున 4 గంటలకే శవంగా పడుకోగా, మధ్యాహ్నం 2 గంటల వరకు శవంలా కదలకుండా ఉండడం ఈ కార్యక్రమంలో విశేషం. ఆవుల మంద కాపరి అయిన లంకన్నను నాగమ్మ సైన్యం మట్టుబెట్టగా విష్ణు సంభూతుడైన బ్రహ్మానాయుడు లంకన్నకు తులసితీర్థం ఇచ్చి ప్రాణప్రతిష్ఠ చేసే ఘట్టం నిర్వహించారు. అనంతరం లంకన్నగా ఉన్న వీరాచారవంతుడిని నాగులేటిలోని గంగధార మడుగు వద్దకు తీసుకెళ్లి స్నానమాచరింపజేశారు. ఆ తర్వాత కొణతములకు గ్రామోత్సవం జరిపారు. చెన్నకేశవస్వామి, అంకాళమ్మ ఆలయాల్లో తీర్థం స్వీకరించారు. వీర్ల దేవాలయం వద్ద కత్తిసేవ చేశారు. ఇలా కల్లిపాడు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీరాచార పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు పర్యవేక్షించారు.

కారంపూడిలో ఐదు రోజులుగా జరిగిన పల్నాటి వీరారాధన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరిరోజు బుధవారం నాడు కల్లిపాడు నిర్వహించారు. వీరాచారవంతుడు శవంను తలపించేలా వేకువజామున నాలుగు గంటలకు పడుకుని మధ్యాహ్నం రెండు గంటల వరకు కదలకుండా అలాగే ఉండటం ఆకట్టుకుంది. గ్రామోత్సవంలో చివరిగా కొణతములకు ఊరేగింపు నిర్వహించారు.


శవంగా పడుకున్న వీరాచారవంతుడు


ప్రాణప్రతిష్ఠ అనంతరం వీరాచారవంతుడిని గంగధారమడుగుకు తీసుకెళ్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు

ముగిసిన వీరారాధన ఉత్సవాలు

గత నాలుగు రోజులుగా 'రాచగావు', 'రాయభారం', 'మందపోరు', 'కోడిపోరు'లతో నిర్వహించిన వీరారాధన ఉత్సవాలు బుధవారం నిర్వహించిన 'కల్లిపాడు'తో ముగిశాయి. రాత్రి వేళ బ్రహ్మనాయుడు నృసింహకుంతంతో పాటు దైవాలు (కొణతములు) గ్రామోత్సవంలో చివరిగా ఊరేగింపు నిర్వహించగా, ఇంటింటి వద్ద హారతులు పట్టారు. కొణతములకు నూతన వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించారు. పోతురాజు గుట్ట వద్ద తంగెడ మండలపై కొణతములన్నీ ఒరిగాయి. ఈ తంగెడ మండలను ప్రజలు తమ గృహాల గడపల వద్ద కట్టుకున్నారు. దీంతో ఉత్సవాలు ముగిశాయి.


సీనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన నంద్యాల ఎడ్లజతతో మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ముగిసిన ఎడ్లబండలాగుడు పోటీలు

సీనియర్స్ విభాగంలో నంద్యాల ఎడ్ల జతకు ప్రథమ స్థానం

వీరారాధన ఉత్సవాల సందర్భంగా స్థానికంగా నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు ముగిశాయి. బుధవారం సీనియర్ విభాగంలో పోటీలు జరిపారు. నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన కుందూరు రాంభోపాల్‌రెడ్డి ఎడ్ల జత నిర్ణీత వ్యవధిలో పందెపు బండను 2665.01 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లజత 2651.02 అడుగులతో రెండోస్థానం, బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్ల జత 2,200 అడుగులతో మూడోస్థానం, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యలం సాంబశివరావు ఎడ్లజత 1,603 అడుగులతో నాలుగోస్థానం, నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన కుందూరు రాంభోపాల్‌రెడ్డి ఎడ్లజత 1600 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా సూరపనేని రాధాకృష్ణ, గూడా శ్రీనివాసరావులు వ్యవహరించారు.

అమర గాయకుడు ఘంటసాల


ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమర గాయకుడు ఘంటసాల అని, సినీ గీతాలే కాకుండా ఆయన వ్యాఖ్యానంతో పాడి ఆలపించిన భగవద్గీత తెలుగువారి ప్రతి ఇంటా ఉంటోందని విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ యూ దేవపాలన అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఘంటసాల గురించి పలు విషయాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జ్యోతి చంద్రమౌళి, ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ హత్య కేసు కొట్టివేత

సంతమాగులూరు, డిసెంబరు 4 : సంతమాగులూరు గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం వెంకటరెడ్డిని 10-4-2016వ తేదీన ఆయన ఇంటివద్ద వేట కొడవళ్లతో దారుణంగా హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి అప్పటి నుంచి కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. ఈ కేసులో సంతమాగులూరు గ్రామానికి చెందిన అట్లా చినవెంకటరెడ్డితో పాటుగా మరో 6గురిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. వారిలో ఒకరు మృతి చెందగా, మిగిలిన 6మంది విచారణకు హాజరవుతూ వస్తున్నారు. బుధ వారం ఒంగోలు కోర్టులో 7వ అదనపు అడిషినల్ జడ్జి టి.రాజావెంకటాద్రి ఈ కేసుకు సంబంధించి విచారణలో ఎటువంటి నిర్ధారణ కాక పోవడంతో ఈ కేసును కొట్టివేసినట్లు తెలిపారు.

సంతమాగులూరులో పికెట్

గడ్డం వెంకట రెడ్డి హత్య కేసును బుధవారం ఒంగోలు కోర్టులో కొట్టివేసిన నేపథ్యంలో సంతమాగులూరు గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

పోలీసులకు గ్రామస్థుల ఫిర్యాదు

చీరాలటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నివసించే స్థావరాలు, నిత్యం విద్యార్థులు రాకపోకలు చేసే మార్గంలో మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించాలని పలువురు ఈపూరుపాలెం గ్రామస్థులు అన్నారు. ఈపూరుపాలెంలో ఇటీవల అనుమతి పొందిన లక్కీ వైన్స్‌పై కొందరు గ్రామస్థులు వ్యతిరేకత తెలిపారు. ఈక్రమంలోనే గతంలో ఎస్పీ తుషార్‌డూడీకి ఫిర్యాదు చేశారు. బుధవారం ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణం వలన అక్కడ నివసించే ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. వందల సంఖ్యలో అటుగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నట్లు వారు ఎస్సైకు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు ఎస్సై వారికి హామీ ఇచ్చారు.

స్త్రీ నిధి రుణాలను సకాలంలో చెల్లించాలి

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ నిధి రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించాలని లేకుంటే చర్యలు తప్పవని స్త్రీ నిధి మేనేజర్ టెక్కెం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం వీవోఏల సమీక్షా సమావేశం జరిగింది. స్త్రీ నిధి రుణాలు సభ్యులకు అధిక మొత్తంలో ఇచ్చి వారి అభివృద్ధికి దోహదపడాలని శ్రీనివాసరావు కోరారు. సమావేశంలో డీఎంజీ భాస్కరరావు, సీసీలు సాల్మన్, సురేష్, చంద్ర, భాస్కరమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అన్నారు. బుధవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ప్రధాన రహదారి వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ బి. అశోక్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

చినగంజాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహాయ సహకారాలు ప్రశంసనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.దేవదత్తం అన్నారు. మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలోని పిచ్చి మొక్కలు, పొదలను పాఠశాల పూర్వ విద్యార్థులు, రామదండు సేవాదళ్ సభ్యులు బుధవారం శుభ్రం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు హెచ్ఎం తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆసోది సుదర్శన్‌రెడ్డి, పీ.డి. ఎం.అనిల్‌కుమార్, పాఠశాల పూర్వ విద్యార్థులు, రామదండు సేవాదళ్ సభ్యులు పాఠశాల పరిసరాల శుభ్రతలో పాల్గొన్నారు.

గోకులం షెడ్లను త్వరగా నిర్మించాలి

పర్చూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్చూరు, చీరాల నియోజకవర్గ పరిధిలో మంజూరైన గోకలం షెడ్ల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తిచేయాలని బాపట్ల జిల్లా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి పి.శాంతారావు అన్నారు. బుధవారం జాతీయ ఉపాధిహామీ పథకం కార్యాలయంలో చీరాల, వేటపాలెం, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండాల ఉపాధి హామీ సిబ్బందితో గోకుల నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుపోషకులకు సౌలభ్యం కల్పించే విధంగా తక్కువ ఖర్చుతో నాణ్యమైన షెడ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. నిర్మాణ కొలతలు తదితర ఆంశాల గురించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పర్చూరు ఏపీవో బుల్లియ్య, ఆయా మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిగజారిన ధాన్యం ధరలు

- ఏర్పాటుకు నోచుకోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకు కొంటున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు

దర్శి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులను ప్రైవేట్ వ్యాపారులు దగా చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వారు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి పట్టించుకోవటం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో నిల్వ ఉంచితే మరింత నష్టపోవాల్సి వస్తుందనే భయంతో వ్యాపారులు అడిగిన మేరకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

మద్దతు ధర అమలు కావడం లేదు..

ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల బస్తాను రూ.1400 కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది తరుగు కింద మరో మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం గ్రేడ్-1 రకానికి 75 కేజీల బస్తాకు రూ.1740, సాధారణ రకానికి రూ.1725 మద్దతు ధర నిర్ణయించింది. కేంద్రాలు ఆరంభమైతే ఆ మేరకు రైతులకు గిట్టుబాటు ధర లభించేది ఇప్పటి వరకు ఎక్కడా కేంద్రాలు ఆరంభం కాకపోవటంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తుంది. తుఫాన్ ప్రభావంగా నాలుగు రోజులుగా తరచూ చిరుజల్లులు పడుతుండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. భారీ వర్షం కురిస్తే కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. సన్న, చిన్న కారు రైతులు ధాన్యాన్ని ఇళ్లల్లో నిల్వ చేసుకునే అవకాశం లేక కళ్లాలు చేసిన వెంటనే తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు బస్తాకు రూ.300పైగా రాబడి కోల్పోతున్నారు. అధికారులు మార్కెటింగ్‌లో జరుగుతున్న దోపిడీని గుర్తించి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పట్టిపీడిస్తున్న జ్వరాలు

- ఎక్కడచూసినా బాధితులే
- పది రోజుల్లో 16 వేల కేసులు
- ఎక్కువ మందికి గున్యా, మలేరియా
- అక్కడక్కడా డెంగ్యూ
- మంచం పట్టిన గ్రామాలు
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాలకు గ్రామాలు మంచం పడుతున్నాయి. ఎక్కువ మంది గున్యా లక్షణాలతో బాధపడుతున్నారు. తీవ్రత ఎక్కువగా ఉన్న వారు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. ఆర్థికస్థోమత లేని వారు ఇంటి వద్దనే ఉండి స్థానిక వైద్యుల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని డెంగ్యూ కేసులు నమోదు కావడం లేదని వైద్యారోగ్య శాఖ అధికారులు చెప్తున్నప్పటికీ ప్రైవేటు వైద్యశాలల్లో రోజుకు 50 నుంచి 70కిపైగా ఈ కేసులు బయటపడుతున్నట్లు తెలుస్తోంది. డెంగ్యూ పేరుతో ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు రోగుల నుంచి రూ.వేలకు వేలు పిండుకుంటున్నారు. మలేరియా కేసులు తక్కువగానే ఉన్నా టైఫాయిడ్ కేసులు ఓ మోస్తరుగా నమోదువుతున్నాయి. అధిక వర్షాలు, పారిశుధ్య లోపమే వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమైంది.


రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

ఒంగోలు(కలెక్టరేట్)/మార్కాపురం/కొండపి, డిసెంబరు 4 : జిల్లావాసులను సీజనల్ వ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా విష జ్వరాలు వణికిస్తున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్నిచోట్లా జ్వరపీడితులు కన్పిస్తున్నారు. పది రోజుల నుంచి తీవ్ర అధికమైంది. వర్షాల కారణంగా దోమల ఉత్పత్తి పెరగడం, నీటి నిల్వలు చేరడం, పారిశుధ్యం అంతంతమాత్రంగా ఉండటమే వ్యాధుల వ్యాప్తికారణమైంది. దీంతో వైద్యశాలలు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ముందుగా సమీపంలో ఉండే ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్య సేవలు పొంది అక్కడ తగ్గకపోతే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు. అక్కడ కూడా నయంకాకపోవడంతో ప్రైవేటు వైద్యశాలల్లో చేరుతున్నారు. విషజ్వరాలు ప్రధానంగా మార్కాపురం, కనిగిరి డివిజన్‌తోపాటు ఒంగోలు డివిజన్‌లో జిల్లాకేంద్రమైన ఒంగోలు, చీమకుర్తి, కొండపి మండలాల్లో మరింత ఎక్కువగా ఉన్నాయి.

పెరుగుతున్న బాధితులు

జిల్లావ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం పది రోజుల వ్యవధిలో 16వేల మందిపైగా విష జ్వరాల బారినపడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో సాధారణ వైరల్ ఫీవర్‌తోపాటు డయోరియా గున్యా, చికెన్ ఫాక్స్, మలేరియా, డెంగ్యూ కేసులు కూడా నమోదవుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రజానీకం వైరల్ ఫీవర్ బారిన పడుతున్నా పంచాయతీ పాలకవర్గాలు పారిశుధ్య నిర్వహణ గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో నమోదైన కేసులు
జనవరి నుంచి ఇప్పటివరకు
4.60లక్షల వైరల్ ఫీవర్‌లు,
322 డెంగ్యూ కేసులు నమోదు
గత పది రోజుల్లో 16వేల వైరల్ ఫీవర్ కేసులు
36 మలేరియా జ్వరం కేసులు
భారీగా గున్యా కేసులు నమోదు

ఫీవర్ సర్వే ఎక్కడ?

వైద్యారోగ్యశాఖ ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితుల అవగాహన కోసం ఫీవర్ సర్వే నిర్వహించాల్సి ఉంది. దీని ద్వారా కుటుంబంలో ఎవరికి జర్వాలు ఉన్నాయి, ఇంకేమైనా వ్యాధులు ఉన్నాయా.. అని తెలుసుకునే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఎంత మందికి వైరల్ ఫీవర్ ఉందో కూడా అధికారికంగా లెక్కలు తేలడం లేదు. కేవలం ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చిన కేసులను నమోదు చేసుకొని మమ అనిపిస్తున్నారు.

నమోదు కాని వారెందరో

ప్రైవేటు వైద్యశాలలో కొన్నిరకాల వ్యాధులను మాత్రమే నమోదు చేస్తుంటారు. మిగిలిన వాటిని నమోదు చేసే పరిస్థితి లేదు. ఇక ప్రతి గ్రామంలో ఆర్ఎంపీలు, పీఎంపీలు విస్తరించారు. వారి వద్ద కూడా ప్రతిరోజు వందలాది మంది జ్వరాలు, ఇతర వ్యాధులకు చికిత్స పొందుతున్నారు. అటువంటి వారి లెక్కలు నమోదు కావడం లేదు. ఇక జిల్లా వ్యాప్తంగా అనేక రకాలు వ్యాధుల బారిన పడి మెరుగైన చికిత్స కోసం ఇతర జిల్లాలకు వెళ్లిన వారు కూడా కనిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈ విధంగా ప్రజానీకం వ్యాధుల బారిన పడుతున్నా వైద్యారోగ్యశాఖ మాత్రం కనీసం గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

కొండపి మండలంలోని పెదకండ్లగుంటలో చికున్ గున్యా విజృంభించింది. ఇప్పటికే 50మంది దీని బారిన పడ్డారు. అనేక మంది నడవలేని స్థితిలో మంచం పట్టారు. కీళ్లనొప్పులతో కదల్లేకపోతున్నారు. కొందరు కర్రల సాయంతో నడుస్తున్నారు. వయసు మీరిన వారు దోగాడాల్సి వస్తుందని పలువురు వివరించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి మందులు ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మార్కాపురం ప్రాంతంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రోజుకు 350మంది రోగులు వస్తుండగా అందులో 100 మందికిపైగా జ్వరపీడితులు ఉంటున్నారు. ప్రైవేటు వైద్యశాలు, ఆర్ఎంపీల వద్దకు రోజుకు 500 మందికిపైగానే జ్వరాలతో బాధపడుతున్న వాళ్లు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- ప్రధానంగా భూసమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా
- గ్రామాల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ రూపకల్పన
- రెవెన్యూతోపాటు దేవదాయ, రిజిస్ట్రేషన్ శాఖ భాగస్వామ్యం
- ప్రజాప్రతినిధులకు కూడా ఆహ్వానం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూసమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాభూములతోపాటు అసైన్డ్, దేవదాయ, చుక్కల భూములను దోచేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున భూముల ఆక్రమణలు జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అలాగే వారం వారం జరిగే గ్రీవెన్స్‌సెల్‌తోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉన్నతాధికారులను కలిసి పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగా శుక్రవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 8వతేదీ వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేసింది. అందుకనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో జిల్లాలోని 38 మండలాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా మండలాల్లో గ్రామాలవారీగా సదస్సులు నిర్వహించేందుకు షెడ్యూల్ కూడా రూపొందించారు. ఆ షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించనున్నారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ

ఈ గ్రామసభల్లో రెవెన్యూతోపాటు దేవదాయ, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు కూడా ఈ సదస్సుల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ప్రధానంగా గ్రామాల్లో ఫ్రీహోల్డ్ భూములతోపాటు 22(ఏ), ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించడంతోపాటు భూములు ఉండి ఆన్‌లైన్ కానటువంటి సమస్యలతోపాటు పలు రకాల సమస్యలపై గ్రామ సభల్లో అర్జీలను స్వీకరించనున్నారు. స్వీకరించిన అర్జీలను కంప్యూటరీకరణ చేసి ఆయా సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జిల్లాలో లక్షలాది ఎకరాలు ప్రభుత్వ భూములు భూకబ్జాలు, అన్యాక్రాంతం కావడంతో అటువంటి భూములపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ భూములన్నింటిని గ్రామాల వారీగా గుర్తించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది.

40వేల ఎకరాల దేవుడి భూములు అన్యాక్రాంతం

మరోవైపు జిల్లాలో దేవదాయ భూములు కూడా 40వేల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు ఇప్పటికే ఆ శాఖ గుర్తించింది. అటువంటి భూములను కూడా గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే ప్రజలకు సంబంధించి ఇతర రెవెన్యూ సమస్యలను కూడా ఆ సదస్సుల్లో అర్జీలు తీసుకొని కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కుటుంబ సమస్యల కారణంగా నెలకొన్న భూ సమస్యలపై కూడా దృష్టిసారించినట్లు సమాచారం. ఇప్పటికే కలెక్టర్ తమీమ అన్సారియా సదస్సులపై సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు, మండల తహసీల్దార్లకు దిశానిర్దేశం చేసింది. ఈనెల 6వతేదీ నుంచి జరగనున్న రెవెన్యూ సదస్సులను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు గ్రామాల వారీగా షెడ్యూల్ రూపొందించాలని ఆదేశాలు జారీ చేయడంతో తదనుగుణంగా మండల స్థాయిలో తహసీల్దార్లు తేదీల వారీగా షెడ్యూల్‌ను కూడా రూపొందించారు.

ఏలూరి ఆదేశాలతో శరవేగంగా సీసీ రోడ్డు పనులు


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నేతలు

కారంచేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సక్రమంగా రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం రాకతో ప్రజల ప్రయాణ కష్టాలు తీరుతున్నాయి. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా నిధులు మంజూరు కావడంతో పర్చూరు నియోజకవర్గంలో పనులు చకచకా సాగుతున్నాయి. కారంచేడులో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఈపీ కుమార్, జాగర్లమూడి ప్రహ్లాద్, చాగంటి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యులు శేషారత్నం, సర్పంచ్ శివపార్వతి, భూలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం


మాట్లాడుతున్న ఏడీఏ ధన్‌రాజ్

అద్దంకిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి ఎస్. దీప్తి తెలిపారు. బుధవారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలల్లో పొలంపిలుస్తొంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.8వేలు, పూల సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.6200 ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. మినీ ట్రాక్టర్, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్, తైవాన్ స్ప్రేయర్‌లు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, భూములలో నీరు నిల్ల లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదుచేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ అనూష, రైతులు పాల్గొన్నారు.

పోషక లోపాలు లేకుండా చూడాలి

మేదరమెట్ల : వర్షాలు అధికంగా కురుస్తున్నందున శనగ, పొగాకు, మినుము సాగులో పోషక లోపాలు లేకుండా చూసుకోవాలని ఏడీఏ ధన్‌రాజ్ తెలిపారు. బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రాసంగులపాడు, కనగాలవారిపాలెం గ్రామాలలో శనగ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెంటనే బయటకు పెట్టాలని రైతులకు సూచించారు. నీరు నిల్వ ఉంటే శనగ పంట కుళిపోతుందన్నారు. పోటాష్ భాస్వరం ఎరువులు వేయడం వలన నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలలో భాగంగా జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. తెగుళ్ల, పురుగులు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించి అవసమైన మందులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, రామిరెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట బీమా చేయించాలి

చినగంజాం : రైతులు పంటల బీమానుచేయించాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు అన్నారు. కడవకుదురు గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన సభలో ఏవో మాట్లాడారు. పీఎం కిసాన్‌కి సంబంధించిన రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోని వారు ఉంటే వెంటనే చేయించుకోవాలని సూచించారు. వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ చైతన్య రైతు సేవా కేంద్రం సిబ్బంది బి.కిషోర్, దీవెన, రైతులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీతో గడ్డికత్తిరించే యంత్రం

యద్దనపూడి : పశుపోషకులకు 40 శాతం రాయితీతో గడ్డికత్తిరించు యంత్రం చాఫ్ కట్టర్‌ను అందిస్తున్నట్లు పశు వైద్యాధికారి పీ శారద అన్నారు. బుధవారం యద్దనపూడి మండలంలో పోలూరు, శ్యామలవారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ఎన్.మేరమ్మ, వ్యవసాయ సహాయకులు లీలాసత్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

15లోగా ఫసల్ బీమా చెల్లించాలి

రైతులు ఈనెల 15వ తేదీలోగా రబీ పైర్లకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ చేయించాలని మార్టూరు మండల వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ అన్నారు. బొల్లాపల్లి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది చైతన్య తదితర రైతులు పాల్గొన్నారు.

అమ్మానాన్నలకు ఆహ్వానం

(5వ పేజీ తరువాయి)

జారీ చేసింది. పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యుల్ని, తల్లిదండ్రుల్ని పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములుగా చేసి ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రతిగతి, పాఠశాల అభివృద్ధి పర్యవేక్షించేలా కార్యచరణ సిద్ధం చేశారు.

- పాఠశాలలో అభివృద్ధికి అవసరమైన కొనుగోళ్ళ బడ్జెట్, సుందరీకరణ, పర్యావరణ పరిక్షణ, మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయుల అంతర్గత సమస్యలు, మంచినీరు ఇతర అంశాలపై సమావేశంలో చర్చిస్తారు. .
- విద్యార్థుల ప్రగతి, వారి ఆరోగ్యానికి సంబంధించిన వైద్య నివేదికలు అంటే శారీరక, మానసిక, కంటి సంబంధ సమస్యలు, పౌష్టికాహార లోపం వంటివి ఇందులో నివేదిస్తారు. కొన్నిచోట్లు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.
- పాఠశాల పూర్తి అయిన తరువాత ఇంటి వద్ద విద్యార్థుల్ని ఎలా పర్యవేక్షించాలి? సెల్‌ఫోన్, టీవీలు, ట్యాబ్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల వినయోగంపై నియంత్రణ ఎలా ఉండాలి? వంటి అంశాలుచర్చిస్తారు.
- ప్రత్యేక సమావేశాల సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడానికే : డీఈవో రేణుక

పాఠశాలల్లో జరిగే అభివృద్ధి పనుల్లో, విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల్ని భాగస్వాములుగా చేయడానికే ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయని డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. ప్రత్యేక సమావేశాలకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఉపాధ్యాయులకు, హెచ్ఎంలకు అందజేశామని వివరించారు. పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రేణుక బుధవారం "ఆంధ్రజ్యోతి"కి వివరించారు.

బీసీ కార్పొరేషన్‌కు... 'రుణ' కళ

(5వ పేజీ తరువాయి)

ముఖ్యంగా ఆదరణ పథకం, వెనకబడిన తరగతుల అభివృద్ధి కార్పొరేషన్ కింద రుణాలు, వాహనాలను రాయితీపై అందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదేళ్ల పాలనలో దాదాపు 40,000 మందికి రూ.800 కోట్ల లబ్ధిని బీసీలకు చేకూర్చిన ఘనత అప్పటి టీడీపీ ప్రభుత్వానిది. కానీ 2019లో వైసీపీ గద్దెనెక్కగానే ఈ పథకాలన్నింటికి గ్రహణం పట్టించడంతో పాటు బీసీ కార్పొరేషన్‌ను నిర్వీవం చేసేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయితీ రుణాలకు నోచుకోని వెనకబడిన వర్గాల ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారు.

ప్రస్తుతం నిధుల కేటాయింపు...

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే బీసీలకు ఏ విధంగా లబ్ధి చేకూర్చాలనే అనే అంశంపై దృష్టి పెట్టింది. దానికి అనుగుణంగానే జిల్లాల వారీగా నిధులు కేటాయింపుతో పాటు లబ్దిదారుల సంఖ్యను కూడా ప్రకటించింది. గుంటూరు జిల్లాకు సంబంధించి ఏడాది వ్యవధిలో రూ.69 కోట్లను వెనకబడిన వర్గాల రుణాల కోసం రాయితీల రూపంలో అందించాలని కేటాయింపులు జరపడంతో పాటు 4,490 మందికి ఈ నిధుల ద్వారా లబ్ధి చేకూర్చాలని సంకల్పించింది. అదే విధంగా బాపట్ల జిల్లాకు గాను రూ.47.60 కోట్లు కేటాయించిన పాలకులు 2,875 మందికి లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు రచించారు. ఇక పల్నాడు జిల్లాకు వచ్చేసరికి 3,691 మంది లబ్ధిదారులకు గాను రూ.58 కోట్లను ఖర్చు చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే మొదలు కాగా డిసెంబరు రెండో వారం నుంచి లబ్ధిదారుల ఎంపికను చేపట్టే దిశగా అడుగులు వేయనున్నారు

మహిళలు, చేతివృత్తులు

రాయితీ రుణాలలో అగ్ర తాంబూలం మహిళలతో పాటు చేతివృత్తుల వారికే కేటాయించే విధంగా మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించడంతో పాటు నైపుణ్యంపై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇక మహిళల విషయానికి వచ్చేసరికి బ్యూటీషియన్ విభాగంతో పాటు మగ్గం, కంప్యూటర్ ఇతర నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారికి రాయితీ రుణాలు అందించి సొంతకాళ్ల మీద నిలబడేలా ప్రభుత్వం వారికి అండగా నిలవనుంది.

శిశు విక్రయం కేసు చీమకుర్తిలో నమోదు

నిందితులను విచారిస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శిశువును విక్రయించిన ఘటనకు సంబంధించి చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చీమకుర్తి మండలం చంద్రపాడుకు చెందిన మహిళ తన చిన్నబిడ్డను తీసుకొని బస్సులో ప్రయాణం చేస్తుండగా పొదిలికి చెందిన గుర్నాధం అరుణ పరిచయమైంది. మాటలు కలిపింది. తనకు ఐదుగురు ఆడపిల్లలని చెప్పడంతో, వేరే వాళ్లకు పిల్లలు లేరు మీ పాపను ఇస్తావా.. అని అడగడంతో పాప తల్లి అంగీకరించింది. దీంతో గత నెల 30న అరుణ పాప తల్లికి ఫోన్ చేసి బిడ్డను తీసుకొని వేటపాలెం రమ్మని చెప్పింది. వారు వెళ్లగా అక్కడ అరుణ కర్లపాలెంకు చెందిన ఎస్‌కె షబానాను పరిచయం చేసింది. అక్కడ మరికొంత మంది కూడా ఉన్నారని పాప తల్లి ఫిర్యాదులో పేర్కొంది. రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అందుకు సంబంధించి షబానా పాప తల్లికి రూ.50వేలు ఇచ్చినట్లు తెలిపింది. పాపను ఇచ్చి అక్కడ నుంచి అందరూ వచ్చేశారు. అయితే తల్లికి బిడ్డ గుర్తురావడంతో చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసి పాపను కర్లపాలెం నుంచి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. షబానా, మధ్యవర్తిగా ఉన్న అరుణలను చీమకుర్తి పోలీసులు విచారిస్తున్నారు.

శిశువు విక్రయం రిమ్స్‌లో జరగలేదు : సూపరింటెండెంట్ వివరణ

కాగా రిమ్స్‌లో ఎలాంటి శిశు విక్రయాలు జరగలేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ టి.జమున తెలిపారు. ఫిర్యాది చీమకుర్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పొదిలికి చెందిన మహిళ బస్సులో పరిచయం అయ్యిందని, బాధిత తల్లి పోలీసులు చెప్పారని వివరించారు. రిమ్స్‌లో శిశు విక్రయాలు జరగలేదని చెప్పారు.

20లోగా కవిత్వ పోటీలు నిర్వహించండి

ఇంకొల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న తెలుగు కవిత్వ పోటీలను ఈ నెల 20వ తేదీలోగా నిర్వహించాలని పరిషత్ జిల్లా సంచాలకులు పిడపర్తి పేరిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. పోటీలలో ప్రథమ విజేత జిల్లా స్థాయి పోటీకి అర్హులన్నారు. జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.1000, రూ.750, రూ.500 నగదు బహుమతిని అందజేస్తారన్నారు. పూర్తి వివరాలకు 9492274525కు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు సబ్ స్టేషన్ పరిధిలో నూతనంగా బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ప్రాంగణం..భయం..భయం

- చిట్టడవిలా మారిన ఆట స్థలం
- కస్తూర్బా గాంధీకి ఉదారంగా ఇచ్చిన దాతలు
- అభివృద్ధి చేయాలని మంత్రి గొట్టిపాటికి విజ్ఞప్తి చేసిన ఉపాధ్యాయులు
- వెంటనే బాగు చేయించాలని కోరుతున్న విద్యార్థినులు


విద్యాలయం ఆట స్థలంలో దట్టంగా ఉన్న ముళ్లపొదలు

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా బాలికలు ఆడుకునేందుకు దాతలు ఇచ్చిన స్థలం వృథాగా పడి ఉంది. రోజూ ఆటలు ఆడుకోవాల్సిన విద్యార్థినులు ముళ్ల పొదలు చూసి భయంతో తరగతులకే పరిమితమవుతున్నారు. లక్షలు విలువైన ఆట స్థలాన్ని ఉదారంగా ఇచ్చిన దాతలు చిట్టడవిలా ఉండడం చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఆటలు ఆడుకునేందుకు వీలుగా ప్రాంగణాన్ని అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

బల్లికురవ మండలం గుంటుపల్లి గ్రామ పరిధిలో గత రెండు దశాబ్దాల కిందట బడి మానేసిన బాలికలకు మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యాలయానికి అవసరమైన ఐదు ఎకరాల స్థలాన్ని గుంటుపల్లి గ్రామస్థులు ఉచితంగా ఇచ్చారు. కొంత కాలం కిందట విద్యాలయంలో ఇంటర్ తరగతులను కూడా ప్రారంభించారు. బాలిక అవసరానికి దాతలు ఇచ్చిన స్థలంలో ప్రస్తుతం ముళ్ల పొదలు పెద్ద ఎత్తున అలుముకున్నాయి. దీంతో కాసేపు ఆటలు ఆడుకునేందుకు పిల్లలు భయపడుతున్నారు. తరగతి గదుల నుంచి ఒక్కరూ బయటకు రావడం లేదు. విద్యాలయం చుట్టూ పొలాలు ఉండడం, ఆటస్థలం అడవిలా మారడంతో పాములు, విషపురుగులు వస్తాయని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో క్రీడా స్థలాన్ని కొంత అభివృద్ధి చేసినప్పటికీ తిరిగి ముళ్లచెట్లు బాగా పెరిగిపోవడంతో ఆటలు ఆడేందుకు వీలులేకుండా పోయిందని అంటున్నారు. కేజీబీవీ క్రీడా ప్రాంగణం దుస్థితిని ఇటీవల బల్లికురవ వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

వెంటనే ప్రాంగణం అభివృద్ధికి చొరవచూపాలని కోరినట్లు చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఉపాధి పథకం కింద ఆట స్థలాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు ప్రాంగణం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.


శేషమ్మను విచారిస్తున్న అధికారులు

కొడుకు నుంచి తల్లికి భూమి అప్పగింత

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తన పోషణ చూడకుండా వారసత్వంగా సంక్రమించిన భూమిని దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్న కుమారుడి నుంచి ఆ భూమిని తిరిగి తల్లికి అధికారులు అప్పగించారు. మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన బత్తుల శేషమ్మ భర్త రామకోటికి కొండమూరు రెవెన్యూలో సర్వే నెంబరు 2-1లో 0.31 సెంట్ల విస్తీర్ణం గల వ్యవసాయభూమి ఉంది. వీరికి తిరుపతయ్య, శ్రీను అనే ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు చనిపోగా చిన్నకుమారుడు శ్రీను తనకు చెందిన భూమిని దౌర్జన్యంగా సాగు చేసుకుంటూ తన పోషణ చూడటం లేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదును అందుకున్న తహసీల్దార్ సింగారావు బుధవారం ఎంపీడీవో స్వరూపారాణి, ఎస్ఐ వినోద్‌బాబులతో కలసి కొండమూరులోని ఆ భూమిని పరిశీలించి తగు విచారణ జరిపారు. విచారణ అనంతరం శ్రీనుకు ఎంసీ నెం.47 నోటీసు ఇచ్చి, 0.31 సెంట్ల భూమిని శేషమ్మకి అప్పగించినట్లు తహసీలాదర్ సింగారావు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం, చీరాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్త కొమ్ము వీరయ్య (54) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు ఆ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి అండగా ఉంటామని చెప్పారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ జీవీ చౌదరి

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రోడ్లపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. బుధవారం బల్లికురవ, వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న పలు దుకాణాల వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. దుకాణాల ముందు ఎవరైనా వాహనాలు ఉంచితే దుకాణదారులు చెప్పాలన్నారు. రోడ్లపై ఇష్టానుసారం నిలిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం మల్లాయపాలెం కూడలి వద్ద విజువల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలను ఎస్ఐ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. లైసెన్స్‌లు లేనివారికి పెనాల్టీని విధించారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

వేటపాలెం,చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ప్రజల రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులను శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని తహసీల్దార్ పార్వతి బుధవారం తెలిపారు. 6వ తేదీన వేటపాలెం, 10నదేశాయిపేట, 12న రామన్నపేట, 14న పుల్లరిపాలెం, 17న పందిళ్లపల్లి, 18న పందిళ్లపల్లి, 21న నాయినిపల్లి, చల్లారెడ్డిపాలెం పంచాయతీ, 27న కొత్తపాలెం, జనవరి 3వ తేదీన పాపాయిపాలెం, 8న కొత్తపేటలో గ్రామ సదుస్సులు ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ సదస్సులకు తహసీల్దార్, మండల సర్వేయర్, ఆయా గ్రామ వీఆర్వో, ఆర్ఐ, ఎండోమెంట్ ఈవో, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ప్రతినిధి హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

పర్చూరు : భూ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. బుధవారం గ్రామాలవారీగా ఆ యా పంచాయితీ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల వివరాలను వెల్లడించారు.

మేదరమెట్ల : కొరిశపాడు మండలంలోని అన్ని రెవిన్యూ గ్రామాలల్లో రెవిన్యూ సమస్యలు పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. 6న బొడ్డువానిపాలెం, 10న తిమ్మనపాలెం, 13న తమ్మవరం, 17 మేదరమెట్ల, 21న రావినూతల, 23 పమిడిపాడు, 27 దైవాలరావూరు, 31 అనమనమూరు, జనవరి 2 కొరిశపాడు, 4న పి.గుడిపాడు, 7న మేదరమెట్ల, 8 ప్రాసంగులపాడు, రాచపూడి గ్రామాలల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు గ్రామ సభలలో పాల్గొనాలన్నారు.

ఇంకొల్లు : రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం తెలిపారు.

మార్టూరు : భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 6 శుక్రవారం నుంచి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ టి ప్రశాంతి బుధవారం ప్రకటనలో తెలిపారు.

యద్దనపూడి మండలంలో ఈనెల 6న అనంతవరం 10న యనమదల 11న పోలూరు 13న పూనూరు 17 న జాగర్లమూడి 19న వింజనంపాడు 20న గన్నవరం 21న యద్దనపూడిలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

సారా విక్రయదారుడి అరెస్ట్

చీరాలటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సారా విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో దాడులు నిర్వహించి కనక రమేష్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు.

11 మంది జూదరుల అరెస్ట్

రూ.7,250 నగదు స్వాధీనం

వేటపాలెం, చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేశాయిపేట శివారులో జరుగుతున్న పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో కలసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని రూ.7,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

జాతీయ సర్వే పరీక్షకు 350 మంది హాజరు

అద్దంకిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థుల సామర్థ్య సాధనను అర్థం చేసుకోవడానికి బుధవారం మండలంలోని 14 పాఠశాలలో 3, 6 , 9 తరగతుల విద్యార్థులకు పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ పేరుతో జాతీయ సర్వే కోసం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మొత్తం 360 మంది విద్యార్థులకు గాను 350 మంది హాజరైనట్లు ఎంఈవో గంగాధరరావు తెలిపారు ఈ పరీక్షలను ఫీల్డ్ పరిశీలకులు తనిఖీ చేశారు. పలు కేంద్రాలను ఎంఈవో 2 సుధాకరరావు పరిశీలించారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో గంగాధరరావు

కూలీల ఆటోని ఢీకొట్టిన లారీ

ఏడుగురికి తీవ్రగాయాలు


చీరాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చినగంజాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోను గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామ సమీపంలోని 216వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చినగంజాం గ్రామానికి చెందిన షేక్ పర్వీన్, షేక్ మస్తానీ కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన గుంజి లలిత, జానా మేరీ, సత్తాయిపాలెం గ్రామానికి చెందిన గాలంకి ప్రసన్న, రేవూరి సుమలత, భాగ్యనగర్ గ్రామానికి చెందిన పులిపాటి జ్యోతి వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెంలోని రొయ్యల ఫ్యాక్టరీలో పని చేసేందుకు ప్రతి రోజూ వెళ్తా ఉంటారు. వీరిని కడవకుదురు గ్రామ పంచాయతీ పరిధిలోని పాతపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి తన ఆటోలో తీసుకెళ్తుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం శ్రీనివాసరెడ్డి తన ఆటోలో 7మంది మహిళలను తీసుకొని వెళ్లి, ఫ్యాక్టరీలో పని అనంతరం చినగంజాం గ్రామానికి వస్తున్నారు. పూలవారిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై ఇసుక ట్రాక్టర్‌కు చింతకాయ ఊడిపోవడంతో ట్రాక్టర్‌ని అక్కడే ఉంచారు. జాతీయ రహదారిపై నిలిపిన ట్రాక్టర్‌ని ఆటో అధికమించే క్రమంలో ఒంగోలు వైపు నుంచి వస్తున్న లారీ ఆటోని ఢీకొట్టింది. ఈ ఘటనలో జ్యోతి, మస్తానీ, సుమలత, జాన్‌మేరి, పర్వీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రసన్న, లలిత, ఆటో డ్రైవర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో మస్తాని ఎడమ చేయి విరిగిపడింది. చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మస్తానీని గుంటూరుకు, సుమలతను ఒంగోలు వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

క్రీడాకారులకు రూ.20వేల ప్రోత్సాహం

- సమకూర్చిన టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో 39వ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన వై.యశ్వంత్‌రాజ్, పి. మహాలక్ష్మికి బుధవారం టీడీపీ నాయకులు ప్రోత్సాహకాన్ని అందజేశారు. నియోజవకర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ సమకూర్చిన రూ.20వేల ప్రోత్సాహకాన్ని టీడీపీ కార్యాలయంలో వారు క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నేత కౌతవరపు జనార్దనరావు మాట్లాడుతూ 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన విజయ్‌నగర్ కాలనీకి చెందిన యశ్వంత్‌రాజు(లాంగ్‌జంప్), వైకుంఠపురానికి చెందిన మహాలక్ష్మి (400 మీటర్ల పరుగు), కోచ్ ధనుంజయ్ శ్రీనివాస్‌కు ఆ మొత్తం అందజేసినట్లు తెలిపారు. వారు పోటీలలో రాణించి చీరాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.12,600 ప్రోత్సాహక నగదు బహుమతిని క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, సుధాకరరావు, వలివేటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న గృహాలను ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణాల గ్రౌండింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు బల్లికురవ మండలంలో 123 గృహాలు పనులు పూర్తి కావాల్సి ఉందని, 20వ తేదీలోపు 70 ఇళ్ల పూర్తి చేయాలని టార్గెట్ ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది వెంటనే లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా కొత్తగా గృహాలు కావాలంటే వారి వద్ద దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ రమణనాయక్, మండల ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

శనగ సాగులో విత్తన శుద్ధిని పాటించాలి

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట సాగులో విత్తన శుద్ధిని పాటించడం ద్వారా భూమిలో ఉన్న వ్యాధి కారక సిలింద్రాలను నశింపచేయవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం, ముప్పవరం గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగ, పొగాకు పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాగులూరి వీరాంజనేయులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ సిబ్బంది బాలకృష్ణ, అలెగ్జాండర్, దిల్షా, పలువురు రైతులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌ను కలిసిన వీఆర్వోల సంఘ సభ్యులు

వీఆర్వో సంఘ అధ్యక్షునిగా బాబయ్య

పంగులూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల వీఆర్వోల సంఘ అధ్యక్షునిగా అంబవరపు బాబయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల వీఆర్వో సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం పంగులూరులో జరిగింది. సంఘ ఉపాధ్యక్షునిగా జంద్రాజుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గుమ్మడి నాగు, కోశాధికారిగా ఉదయగిరి సుమతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు తహసీల్దార్ సింగారావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని తహసీల్దార్ అభినందించారు.

వీవోల సంఘం నూతన కమిటీ

పంగులూరు : మండల వీవోఏల నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. వీవోఏల సంఘ అధ్యక్షురాలిగా తోకచిచ్చు చిన్న, ఉపాధ్యక్షురాలిగా బొగ్గవరపు కల్పన, కార్యదర్శిగా మేక నాగమణి, సహాయ కార్యదర్శిగా బాచిన మనోరంజని, కోశాధికారిగా నాదెండ్ల లక్ష్మితిరుపతమ్మను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

చినబాబును పరామర్శించిన మంత్రి రవికుమార్

బల్లికురవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కె.రాజుపాలెంకు చెందిన టీడీపీ నేత జాష్టి కృష్ణబాబు (చినబాబు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటనారాయణబాబు, టీడీపీ నేతలు ఉన్నారు.


జానకిదేవిని సన్మానిస్తున్న పద్మశాలీ బహుత్తమ సంఘం

దేవునికి, భక్తులకు సేవ చేసే అదృష్టం

టీటీడీ పాలక మండలి సభ్యురాలు జానకిదేవి

చీరాల/ఈపూరుపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రంలో దేవునికి, భక్తులకు సేవ చేసుకునే భాగ్యం తనకు దక్కిందని టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి అన్నారు. ఇటీవల దేవస్థానంలో పాలక మండలిలో చోటు దక్కించుకున్న ఆమె మొదటిసారిగా స్వగ్రామమైన చీరాల మండలం ఈపూరుపాలెంలో శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అభినందన సభకు హాజరయ్యారు. ఈసందర్భంగా కమిటీ ప్రతినిధులు ఆమెను ఘనంగా సన్మానించారు. పార్టీకు చేసిన సేవలను గుర్తించి తనకు ఈ అవకాశం ఇచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంజి సుబ్బారావు, బాలాజీ చిన్నారావు, ఆకురాతి పద్మిని, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, కాటూరి చెంబయ్య నరసింహారావు, శ్రీరామచంద్రమూర్తి, కూర్మదేవ బాబా, పుండరీయ్య, లోకేశ్వరరావు, దామర్ల శ్రీకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

పద్మశాలీ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చీరాల పద్మశాలి రామమందిరంలో జానకిదేవిని ఘనంగా సన్మానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల మనోభావాల మేరకు వారికి మెరుగైన సేవలు అందిస్తూ, స్వామివారి సేవలో తన వంతు బాధ్యతగా నడుచుకుంటానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మండూరి ప్రభాకరరావు, కార్యదర్శి గాత్ర నాగరాజు, కోశాధికారి గుంటి పాపారావు, గౌరవాధ్యక్షుడు గాత్ర పకీరయ్య, వెంకటేశ్వరరావు (బాబు) పాల్గొన్నారు.

తారస్థాయికి రామలింగేశ్వరస్వామి దేవస్థాన వ్యవహారం

ఎండోమెంట్ అధికారుల సమక్షంలోనే ఇరువర్గాల వాగ్వాదం


ఆలయ భూములను పరిశీలిస్తున్న ఎండోమెంట్ అధికారులు

చీరాలటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం రామలింగేశ్వర స్వామి దేవస్థానం వ్యవహారం తారస్థాయికి చేరింది. అర్చకులు వీరేశలింగం ప్రసాద్‌ను అకారణంగా తొలగించారని ఫిర్యాదు అందడంతో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాష్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన అర్చక స్వామి గతంలో దేవదాయ ఆస్తుల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు పాలక సంఘ ప్రతినిధులు గతంలో పలు ఆరోపణలు చేశారు. ఈక్రమంలోనే ఆయనను తొలగించారు. అర్చక స్వాముల సంఘం, పాలక సంఘం మధ్య అగ్గిరాజుకున్నట్లయింది. ఈక్రమంలోనే బుధవారం విచారణకు వచ్చిన అధికారుల సమక్షంలోనే వాగ్వాదాలు జరిగాయి. ఎట్టకేలకు రెండు వర్గాలను విచారించిన అధికారులు దేవదాయ భూములను కూడా నిశితంగా పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెండు వర్గాల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

అజాత శత్రువు రోశయ్య

వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు



రోశయ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పిస్తున్న, టీడీపీ, వైసీపీ నాయకులు

చీరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వివిధ హోదాల్లో పనిచేసి, సుదీర్ఘ రాజకీయ జీవితంలో అజాత శత్రువుగా హుందాగా వ్యవహరించిన డాక్టర్ కొణిజేటి రోశయ్యను నేటి తరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. డాక్టర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం టీడీపీ, వైసీపీ నేతలు, కార్యకర్తలు విడివిడిగా రోశయ్య విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా సందర్భాల్లో ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ అనేక పదవుల్లో కొనసాగిన రోశయ్య వాటికి వన్నె తెచ్చారని కొనయాడారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.